


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX


జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 225 | గురువారం 20 - 08 -2026 | పేజీలు : 12 | వెల-3


## డిప్యూటీ చైర్మన్ ఎన్నిక వేళ ఏపీ శాసనమండలిలో కొత్త వివాదం





## తిరుమలలో విజయసాయి రెడ్డి కీలక ప్రకటన

2లో

# విజయసాయి.. కొత్త అడుగు

### వైసీపీలోకి రీఎంట్రీపై ఊహాగానాలకు తెరదించిన విజయసాయి రెడ్డి

- సొంతంగా కొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్లు అధికారిక ప్రకటన
- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రాజకీయ భవిష్యత్‌పై వ్యాఖ్యలు
- ఈ నెలలోనే విజయవాడలో పార్టీ ప్రణాళికను వెల్లడిస్తానని స్పష్టీకరణ
- ప్రజల పక్షాన గొంతుకగా నిలుస్తానని, సరికొత్త రాజకీయానికి శ్రీకారం చుడతానని వెల్లడి

మాజీ ఎంపీ వి. విజయసాయి రెడ్డి తన రాజకీయ పునః ప్రవేశంపై నెలకొన్న సందిగ్ధతకు తెరదించారు. వైసీపీలోకి తిరిగి వెళ్తారంటూ జోరుగా సాగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ, సొంతంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తన కొత్త పార్టీకి శ్రీవారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు.

## ఎన్నికలకు సిద్ధంకండి..



- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా

2లో

## మండలిలో గళం బలంగా వినిపించాలి..



- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వర్ల రామయ్య - మంత్రినారాలోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రామయ్య
- ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు లోకేశ్‌కుకృతజ్ఞతలుకూటమి - విజయాలనుమండలిలోవినిపించాలని సూచించిన మంత్రి

2లో

# ఫొటోగ్రాఫర్‌గా మారిన సీఎం చంద్రబాబు..



సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం కొద్దిసేపు ఫొటోగ్రాఫర్‌గా మారిపోయారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో ఫొటోగ్రాఫర్లతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ల కెమెరాను చేతిలోకి తీసుకుని, వారినే క్లిక్ అనిపించారు. వివరాల్లోకి వెళితే.. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో తనను కలిసిన మీడియా ఫొటోగ్రాఫర్లకు చంద్రబాబు తొలుత శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిలో ఒకరి కెమెరాను తీసుకుని వారికి ఫొటోలు తీశారు. తాను తీసిన ఫొటోలను తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశారు.

- ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రాఫర్‌గా మారిన సీఎం
- అసెంబ్లీ ప్రాంగణంలో ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు
- వారి కెమెరాతోనే ఫొటోలు తీసి క్లిక్ అనిపించిన సీఎం
- 'ఎక్స్' ఖాతాలో ఫొటోలు పోస్ట్ చేసి ప్రత్యేక సందేశం
- చరిత్రను భద్రపరిచేది ఫొటోగ్రాఫర్లేనని కొనియాడిన చంద్రబాబు

2లో

## 'విశాఖపట్నం' ఇక 'ఏఐ పట్నం'..



- విశాఖ డేటా సెంటర్లపై అపోహలు వ్యాప్తి చేస్తున్నారన్న మంత్రి
- డేటా సెంటర్లకు పోలవరం పారిశ్రామిక వాటా నుంచి నీటిని కేటాయిస్తామని స్పష్టత
- థర్మల్ పవర్ ప్లాంట్‌తో పోలిస్తే డేటా సెంటర్ల నీటి వినియోగం చాలా తక్కువని వివరణ
- నీటి వనరులపై ప్రభావం చూపుతాయని పౌర సంఘాలు, విపక్షాల ఆందోళన

2లో

## వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు మావే



- గీత కార్మికులకు పింఛన్లు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటన
- వారి కోసం ప్రభుత్వ భూముల్లో ఈత, తాటి చెట్ల పెంచుతామన్న సీఎం
- కేసీఆర్ సర్కార్ పిల్లల చదువులను విస్మరించిందని విమర్శలు
- హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారన్న ముఖ్యమంత్రి


2లో

## పూణే కోటలో దారుణం...

### 8 ఏళ్ల బాలిక షార్ట్ వేసుకుందని దాడి!



2లో



# వెలిగొండ నిర్వాసితులకు సీఎం చంద్రబాబు భరోసా..

### మరో రూ.200 కోట్ల పరిహారం విడుదల

- వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం
- బాధితులకు శాసనసభ ప్రాంగణంలో చెక్కు అందించిన సీఎం చంద్రబాబు
- ఇప్పటివరకు నిర్వాసిత కుటుంబాలకు మొత్తం రూ.518 కోట్లు చెల్లింపు
- త్యాగాలు చేసిన నిర్వాసితులకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి హామీ

2లో

దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభానికి సమీపిస్తున్న వేళ, ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా పరిహారం అందించిన ప్రభుత్వం, తాజాగా మరో రూ.200 కోట్ల రూపాయల పరిహారాన్ని విడుదల చేసింది. ఈరోజు శాసనసభ ప్రాంగణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా నిర్వాసిత కుటుంబాల ప్రతినిధులకు ఈ చెక్కును అందజేశారు. ఈ విడుదలతో కలిపి ఇప్పటివరకు వెలిగొండ నిర్వాసితులకు ప్రభుత్వం రూ.518 కోట్ల మేర పరిహారం అందించినట్లయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులు, నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం ఎన్నటికీ మరవదని స్పష్టం చేశారు. "త్యాగం మీది, వారికి అండగా నిలవాల్సిన బాధ్యత మాది. వెలిగొండ నిర్వాసితులను గతంలో ఆదుకున్నది మా ప్రభుత్వమే, ఇప్పుడు కూడా అండగా నిలుస్తున్నాం. మిగిలిన పరిహారాన్ని కూడా వీలైనంత త్వరగా విడుదల చేస్తాం. మంచి చేసే ప్రభుత్వాలను ప్రజలు గుర్తించాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వం అండగా నిలిచి, తమకు భరోసా కల్పించడం పట్ల నిర్వాసిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రభుత్వానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని వారు తెలిపారు.

# బిసిల పట్ల కట్టప్పలా మారిన జగన్

### బిసి రిజర్వేషన్లపై ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

రాష్ట్రంలో బీసీల పాలిట జగన్మోహన్ రెడ్డి కట్టప్పలా వ్యవహరించి వెన్నుపోటు పొడిచి అన్యాయం చేశారని ఆదోని నియోజకవర్గం భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన బీసీ రిజర్వేషన్లపై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు నిర్ణయించడం హర్షించదగ్గ విషయమన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 16,800 మంది బీసీలకు అవకాశం దక్కుతుందన్నారు.

2లో

# కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు..

### విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ



2లో

# వెలిగొండ నిర్వాసితులకు సీఎం చంద్రబాబు భరోసా..

**రూ.518 కోట్లకు చేరిన పరిహారం** వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాల్లోని నిర్వాసితులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో భరోసా కల్పిస్తోంది. ఇందులో భాగంగా, సొంతంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద పరిహారం చెల్లిస్తున్నారు. గతంలో 2,557 కుటుంబాలకు ఓటీఎస్ కింద రూ.318 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. తాజాగా మరో 1,600 కుటుంబాలకు రూ.200 కోట్లను అందించింది. దీంతో మొత్తం 4,157 నిర్వాసిత కుటుంబాలకు రూ.518 కోట్ల పరిహారం అందింది. పరిహారంతో పాటు పునరావాసంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నిర్వాసితుల కోసం మొత్తం 7 పునరావాస కాలనీలను అభివృద్ధి చేస్తుండగా, ఇప్పటికే వేములకోట మినహా మిగిలిన 6 కాలనీలలో మౌలిక సదుపాయాల పనులు పూర్తయ్యాయి. విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి అన్ని వసతులు కల్పించడంతో నిర్వాసిత కుటుంబాలు తమకు కేటాయించిన ఇళ్లకు తరలివెళ్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు మావే:

తెలంగాణలోని గీత కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ గీత కార్మికుడికి పింఛను అందిస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో ఆయన ఈ ప్రకటన చేశారు. గీత కార్మికుల జీవనోపాధిని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. వారి ఉపాధిని పెంచేందుకు ప్రభుత్వ భూములు, కాలువ గట్ల వెంబడి ఈత, తాటి చెట్లను విరివిగా పెంచుతామని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటికే రూ. 5 లక్షల పరిహారం అందిస్తోందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ప్రభుత్వం గేదెలు, గొర్రెల పెంపకం వంటి కులవృత్తులను ప్రోత్సహించినట్టే చేసి, వారి పిల్లల చదువులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. తమ ఇందిరమ్మ పాలనలో బహుజనుల పిల్లలు చదువుకుని డాక్టర్లు, లాయర్లు, ఐఏఎస్ అధికారులు కావాలని ప్రోత్సహిస్తున్నామని, ఇదే నిజమైన సామాజిక న్యాయమని పేర్కొన్నారు. కేసీఆర్ చేసింది కుటుంబ న్యాయం అయితే, తాను చేస్తోంది సామాజిక న్యాయం అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రానికి కరవు రావాలని, రైతులు నష్టపోవాలని హరీశ్ రావు కర్ణాటక, తమిళనాడు వెళ్లి క్షుద్ర పూజలు చేస్తున్నారని విమర్శించారు. "క్షుద్ర పూజలు చేసే వారిని చెట్లకు కట్టేసి కొట్టాలి" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ, గౌడ కులస్తులు తమకు పూర్తి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# పూణే కోటలో దారుణం... 8 ఏళ్ల బాలిక షార్ట్ వేసుకుందని దాడి!

**పూణే సింహగడ్ కోటలో పర్యాటకులపై దాడి**

**8 ఏళ్ల బాలిక షార్ట్ ధరించిందని గొడవకు దిగిన యువకులు**

**'కోట సంరక్షణ సమితి' పేరుతో నైతిక పోలీసింగ్**

**దాదాపు రెండు గంటల పాటు కొనసాగిన దౌర్జన్యం**

**ఘటనకు సంబంధించి 9 మందిపై క్రిమినల్ కేసు నమోదు**

పూణేలోని చారిత్రాత్మక సింహగడ్ కోటలో పర్యాటకుల పట్ల కొందరు యువకులు దశ్చర్యకు పాల్పడ్డారు. పర్యాటకులు ధరించిన దుస్తులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సాగించిన ఈ దౌర్జన్యంలో ఎనిమిదేళ్ల చిన్నారితో సహా పలువురు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తొమ్మిది మంది నిందితులపై కేసు నమోదు చేశారు.ఆగస్టు 16న ఈ సంఘటన చోటుచేసుకుంది. కోట సందర్శనకు వచ్చిన ఒక కుటుంబాన్ని అడ్డుకున్న కొందరు యువకులు, వారి ఎనిమిదేళ్ల కుమార్తె షార్ట్స్ ధరించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తలెత్తిన వాగ్వాదం చివరకు భౌతిక దాడికి దారితీయడంతో, కుటుంబ సభ్యుల్లో ఒకరు గాయపడ్డారు. తమను తాము 'కోట సంరక్షణ సమితి' సభ్యులుగా చెప్పుకుంటున్న ఈ బృందం, సుమారు రెండు గంటల పాటు కోట పరిసరాల్లో అలజడి సృష్టించింది. షార్ట్ వంటి అనుచితమైన దుస్తులు ధరించారనే నెపంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు అని కూడా చూడకుండా పలువురిపై దాడులకు తెగబడ్డారు. ఈ అరాచకంతో కోటలోని పర్యాటకులు తీవ్ర భయాందోళనలకు లోనయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు హవేలీ పోలీసులు నిందితులుగా గుర్తించిన తొమ్మిది మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూణే పరిసరాల్లోని కోటల వద్ద ఇలాంటి స్వయంప్రకటిత బృందాలు నైతిక పోలీసింగ్ పేరిట పర్యాటకులను వేధిస్తున్న ఘటనలు ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# బిసిల పట్ల కట్టప్పలా మారిన జగన్

బీసీ వర్గీకరణ చేపట్టి రాజకీయ పదవులు అందరికీ అందేలా చూడాలన్నారు. గత వైకాపా ప్రభుత్వం బీసీలను రాజకీయంగా వాడుకునేందుకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని జీవోలు జారీచేసి.. చివరికి 24 శాతానికి కుదించి తీవ్రంగా అన్యాయం చేశారన్నారు. నీతి ఆయోగ్ సూచనలు మేరకు ప్రత్యక్ష విధానంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించడం శుభ పరిమాణం అన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాం నుంచి బీసీల పట్ల తెలుగుదేశం పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆదోని పట్టణంలో రహదారులను విస్తరించి ట్రాఫిక్ సమస్యలను తగ్గించాలని ఆదోని భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరారు. 1987 తర్వాత ఇప్పుడు 2025లో వంద అడుగుల వెడల్పుతో మాస్టర్ ఎ÷-లాన్ వచ్చిందన్నారు. దీనిని అమలు చేసి పట్టణాన్ని అభివృద్ధి చేయాలని పురపాలక శాఖ మంత్రి నారాయణను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించడం వల్ల పారదర్శకతతో పాటు అక్రమాలకు తావుండదన్నారు. గత వైకాపా పాలనలో ఆదోని పురపాలక సంఘంలో ఇద్దరు ఛైర్‌పర్సన్‌లను మార్చిన ఘనత ఆ పార్టీకే దక్కిందన్నారు. ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకొస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## దళవాయి రమాదేవి ఎంపికతో బీసీలకు బలమైన రాజకీయ సందేశం!

టీడీపీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్న సంకేతాన్ని దళవాయి రమాదేవి ఎంపిక ఇచ్చిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళా నాయకురాలు రమాదేవిని గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా ప్రతిపాదించడం ద్వారా క్షేత్రస్థాయి కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు పేర్కొంటున్నాయి. రమాదేవి డ్వాక్రా సంఘం అధ్యక్షురాలిగా, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అలాంటి నాయకురాలికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం ద్వారా పార్టీ కోసం పనిచేసేవారికి పదవులు దక్కుతాయన్న సందేశం వెళ్లిందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి.ఇదే సమయంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పునరుద్ధరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఒకవైపు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు.. మరోవైపు బీసీ మహిళా నాయకురాలికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం ద్వారా బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.అదే సమయంలో సీనియర్ టీడీపీ నేత, దళిత నాయకుడు వర్ల రామయ్యకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం కూడా సామాజిక ప్రాతినిధ్యంపై చర్చకు దారితీసింది. రమాదేవి, రామయ్య ఎంపికలు పార్టీ కోసం పనిచేసిన నేతలకు గుర్తింపు, సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు..

ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందని, ప్రముఖ విద్యాసంస్థలన్నీ క్రమంగా ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆయన ఆరోపించారు. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ పరీక్షల కుంభకోణాలే స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా యువత లేవనెత్తిన అసలైన సమస్యలకు సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారని ఖర్గే విమర్శించారు. యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ 'విద్య నుంచి ఉపాధి వరకు రోడ్‌మ్యాప్'ను రూపొందించాల్సి ఉందన్నారు. అలాగే అయోధ్య రామాలయం విరాళాల చోరీ వివాదంపై స్పందిస్తూ, నిధుల గోల్‌మాల్‌పై నిష్పాక్షిక విచారణ జరిపించి బాధ్యులను జవాబుదారీ చేయాలని డిమాండ్ చేశారు.

# కూతురి సంచలన వ్యాఖ్యలు.. కొండా సురేఖకు కాంగ్రెస్ నోటీసులు

**మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నోటీసు.**

**సురేఖ కుమార్తె సుస్మిత వ్యాఖ్యలపై వివరణ కోరిన కమిటీ**

**మూడు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశం**

**మాజీ మంత్రి చిన్నారెడ్డికి కూడా షోకాజ్ నోటీసు**

**వనపర్తి ఎమ్మెల్యేపై వ్యాఖ్యలపై చిన్నారెడ్డి షోకాజ్**





తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు సంబంధించి మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి జి. చిన్నారెడ్డికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లోగా లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

**సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై..** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత చేసిన బహిరంగ వ్యాఖ్యలను పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యాఖ్యలపై మంత్రి సురేఖ నుంచి వివరణ కోరింది. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రభుత్వ పెద్దలపై బహిరంగంగా వ్యాఖ్యలు చేయడంపై కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై మూడు రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని సురేఖను ఆదేశించింది. ఇటీవల జరిగిన ఓ సభలో రేవూరి ప్రకాశ్ రెడ్డిని మరోసారి గెలిపించాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన సుష్మిత.. అధిష్ఠానాన్ని సంప్రదించకుండా మీరెలా అభ్యర్థిని ప్రకటిస్తారని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. టికెట్ ఇచ్చినా.. ఇవ్వకపోయినా పరకాల నుంచి తాను పోటీ చేసి గెలిచి తీరతానని తేల్చి చెప్పారు.

**చిన్నారెడ్డికి కూడా నోటీసు** మరోవైపు వనపర్తి జిల్లా కాంగ్రెస్‌లోనూ వివాదం తెరపైకి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యేపై బహిరంగంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో మాజీ మంత్రి జి. చిన్నారెడ్డికి క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. తన వ్యాఖ్యలపై మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. డబ్బులు తీసుకొని ఎమ్మెల్యే సీట్లు కేటాయించారని ఇటీవల చిన్నారెడ్డి ఆరోపించారు. అందుకే తనకు గత అసెంబ్లీ ఎన్నికల్లో సీటు రాలేదని పేర్కొన్నారు. ఫలితంగా వనపర్తి నియోజకవర్గాన్ని నాశనం చేశారని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని.. అవినీతికి పాల్పడేవారిని బయటకు గెంటేస్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత పార్టీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ నేతలపై పార్టీ లైన్ దాటి బహిరంగంగా విమర్శలు చేస్తే సహించబోమని క్రమశిక్షణ కమిటీ హెచ్చరించినట్లు సమాచారం. ఇద్దరు సీనియర్ నేతలకు ఒకేసారి నోటీసులు జారీ కావడంతో తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ చర్చ మొదలైంది. పార్టీ టికెట్ల అంశం చుట్టూ కొనసాగుతున్న అసంతృప్తి ఈ పరిణామాలతో మరోసారి బయటపడినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచారు: ఎస్పీ వెల్లడి

**జల్సాలు, డబ్బు కోసమే ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసుల వెల్లడి**

**గతంలో మందలించడంతో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్న నిందితుడు**

**70 సీసీ కెమెరాలు పరిశీలించి ఇద్దరు మైనర్లను అరెస్ట్ చేసిన పోలీసులు**

**నిందితుల నుంచి రూ. 1.54 లక్షల నగదు, ఐఫోన్ స్వాధీనం**

నల్గొండ జిల్లాలో సంచలనం సృష్టించిన స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. విలాసాలకు అలవాటు పడిన ఇద్దరు మైనర్ విద్యార్థులే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు నిర్ధారించారు. నిందితుల్లో ఒకరు ఆమెను ఏకంగా 27 సార్లు కత్తితో పొడిచి అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 11న కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి ఇంట్లో చోరీ చేసేందుకు ఇద్దరు విద్యార్థులు పథకం రచించారు. అందులో ఒకరు మాస్క్ ధరించి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించాడు. అయితే, ప్రమాదవశాత్తు మాస్క్ జారిపోవడంతో రూపారెడ్డి అతడిని గుర్తుపట్టారు. దీంతో భయాందోళనకు గురైన నిందితుడు, తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. 27 సార్లు పొడిచి చంపిన అనంతరం, ఆమె ఫోన్‌ను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ కేసు దర్యాప్తు కోసం పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సుమారు 70 సీసీటీవీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు ఎస్పీ తెలిపారు. పాఠశాల పునఃప్రారంభమైన తర్వాత గైర్హాజరైన వారిలో ఇద్దరు విద్యార్థులు విపరీతంగా డబ్బు ఖర్చు చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. గతంలో హాస్టల్‌లో ఉన్న సమయంలో నిందితుడి వద్ద నగదు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి అతడిని మందలించారు. అప్పటి నుంచి ఆమెపై కక్ష పెంచుకున్న నిందితుడు, ప్రధానంగా డబ్బు కోసమే ఈ హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదు, ఒక ఐఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నోట్లపై ఉన్న రక్తపు మరకలను ల్యాబ్‌లో పరీక్షించగా, అవి మనిషి రక్తమేనని నిర్ధారణ అయింది. నిందితులు మైనర్లు కావడంతో వారిని జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరుస్తామని ఎస్పీ వివరించారు.



# విజయసాయి కొత్త అడుగు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విజయసాయి రెడ్డి వివరించారు. ప్రజల పక్షాన బలమైన గొంతుకను వినిపించేందుకే కొత్త పార్టీ పెడుతున్నానని స్పష్టం చేశారు. పార్టీకి సంబంధించిన పూర్తి వివరాలు, భవిష్యత్ కార్యాచరణను ఈ నెలలోనే విజయవాడలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడిస్తానని తెలిపారు. దేశం ఎల్‌నినో ప్రభావం లేకుండా సుభిక్షంగా ఉండాలని కూడా స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. గతేడాది తన రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయి రెడ్డి, ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, కొన్ని నెలలకే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. రాజకీయాల్లోకి తిరిగి వస్తానని, సొంతంగా ఒక మీడియా సంస్థను కూడా ప్రారంభిస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. అప్పటి నుంచి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ పలు జాతీయ, రాష్ట్ర అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఆయన తిరిగి వైసీపీ గూటికి చేరతారనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలోనే ఆయన స్పందిస్తూ.. తనది స్వతంత్ర భావజాలమని, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా నిర్ణయం తీసుకుంటానని ట్విట్టర్ వేదికగా స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే 'భారత్ జన వికాస్' పేరుతో ఆయన పార్టీ పెట్టబోతున్నారంటూ సోషల్ మీడియాలో చర్చ జరిగింది. తాజాగా తిరుమలలో ఆయన చేసిన ప్రకటనతో ఈ ఊహాగానాలకు తెరపడింది. త్వరలోనే సొంత జెండాతో ఏపీ రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ఖాయమైంది.

# ఎన్నికలకు సిద్ధంకండి..

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

## ఫొటోగ్రాఫర్‌గా మారిన సీఎం చంద్రబాబు..

ఈ సందర్భంగా చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ఓ ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. "చరిత్రను నమోదు చేసే, జ్ఞాపకాలను భద్రపరిచే ఫొటోగ్రాఫర్లకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ రోజు మన మీడియా, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లను కలవడం గౌరవంగా భావిస్తున్నాను. వారి అంకితభావం, కళానైపుణ్యం, అవిశ్రాంత కృషి మనందరికీ కొత్త దృక్కోణాలను అందిస్తాయి. ప్రతి చిత్రం రాబోయే తరాల కోసం కాలంలోని ఒక భాగాన్ని భద్రపరుస్తుంది. స్ఫూర్తినిచ్చే క్షణాలను బంధిస్తూ ఫొటోగ్రఫీ కమ్యూనిటీ ముందుకు సాగాలి" అంటూ చంద్రబాబు తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

## మండలిలో గళం బలంగా వినిపించాలి..

టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వర్ల రామయ్య, అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో మంత్రి లోకేశ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు మంత్రి లోకేశ్‌కు వర్ల రామయ్య ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరువురు నేతలు కాసేపు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించుకున్నారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. శాసనమండలిలో కూటమి ప్రభుత్వ విజయాలను, ప్రజా అనుకూల విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వర్ల రామయ్యకు సూచించారు. సభలో ప్రజా సమస్యలపై తమ వాణిని బలంగా వినిపించాలని కోరారు. వర్ల రామయ్య వంటి అనుభవజ్ఞుడి సేవలు మండలికి ఎంతో అవసరమని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

# 'విశాఖపట్నం' ఇక 'ఏఐ పట్నం'..

విశాఖపట్నంలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్లపై కొందరు ఉద్దేశపూర్వకంగా అపోహలు సృష్టిస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. డేటా సెంటర్లకు అవసరమైన నీరు, విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ఉందని, దీనివల్ల ప్రజలకు గానీ, సాగునీటికి గానీ ఎలాంటి ఇబ్బంది ఉండదని అసెంబ్లీ వేదికగా ఆయన హామీ ఇచ్చారు. నేడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సుదీర్ఘంగా సమాధానమిచ్చారు.

**నీటి భద్రతపై పూర్తి స్పష్టత** : డేటా సెంటర్లకు నీటి కేటాయింపులపై వస్తున్న ఆందోళనలు అనవసరమని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. "గోదావరి నుంచి ఏటా సగటున 3,000 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోతోంది. విశాఖలో 6.5 గిగావాట్ల డేటా సెంటర్లు ఏర్పాటు చేసినా, వాటికి అవసరమయ్యేది కేవలం 3 టీఎంసీల నీరే. పోలవరం నుంచి గ్రావిటీ ద్వారా విశాఖకు తరలిస్తున్న నీటిని తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు కేటాయించాం. ఈ పారిశ్రామిక వాటా నుంచే డేటా సెంటర్లకు నీరు అందిస్తాం. నగర ప్రజల తాగునీటి వ్యవస్థ నుంచి ఒక్క చుక్క కూడా మళ్లించం. పైగా, ఇప్పుడు ఎయిర్ కూలింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలు అందుబాటులోకి రావడంతో నీటి వినియోగం గణనీయంగా తగ్గుతోంది" అని వివరించారు. రాబోయే 18 నెలల్లో పోలవరం నుంచి గ్రావిటీ ద్వారా విశాఖకు తాగునీరు అందిస్తామని, డేటా సెంటర్ల కోసం ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

**విద్యుత్ ఛార్జీల పెంపు ఉండదు** : విద్యుత్ సరఫరా, ఛార్జీల విషయంలోనూ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ఉందని లోకేశ్ అన్నారు. ఒక గిగావాట్ థర్మల్ ప్లాంట్‌కు, డేటా సెంటర్‌కు వినియోగించే నీటి కన్నా పది రెట్లు ఎక్కువ అవసరమని, కానీ దాని గురించి ఎవరూ మాట్లాడరని ఆయన చురక అంటించారు. "డేటా సెంటర్లు తప్పనిసరిగా 70% గ్రీన్ ఎనర్జీనే వాడాలని స్పష్టమైన నిబంధన పెట్టాం. సౌర, పవన విద్యుత్‌ను వినియోగించుకునేలా ప్రోత్సహిస్తున్నాం. ప్రధాని మోదీ తెచ్చిన 'వన్ నేషన్-వన్ గ్రిడ్' విధానంతో రాయలసీమలో ఉత్పత్తి అయ్యే పునరుత్పాదక శక్తిని దేశంలో ఎక్కడికైనా పంపవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే పలుమార్లు చెప్పారు. పైగా ఈ ఏడాది 13 పైసలు తగ్గించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిది" అని లోకేశ్ గుర్తుచేశారు.

**'విశాఖపట్నం' ఇక 'ఏఐ పట్నం'** : డేటా సెంటర్ల రాకతో విశాఖ స్వరూపమే మారిపోతుందని, ఇది కేవలం కొన్ని ఉద్యోగాలకే పరిమితం కాదని మంత్రి తెలిపారు. "గూగుల్ వంటి దిగ్గజ సంస్థ విశాఖకు వస్తుండటంతో దాని చుట్టూ బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ (ఎకో సిస్టమ్) ఏర్పడుతుంది. కూలింగ్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఫైబర్ తయారీ వంటి అనుబంధ పరిశ్రమలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, ముఖ్యంగా రాయలసీమకు వస్తున్నాయి. ఒక్క కూలింగ్ ఎకోసిస్టమ్ వల్లే రాయలసీమలో 20,000 ఉద్యోగాలు రాబోతున్నాయి. లాజిస్టిక్స్, రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ వంటి రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు పెరుగుతాయి" అని ఆయన పేర్కొన్నారు. కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పినట్లుగా, విశాఖపట్నం ఇక 'ఏఐ పట్నం'గా మారబోతోందని, ఏఐకి సంబంధించిన కోర్సులతో ఒక అమెరికన్ విశ్వవిద్యాలయం కూడా ఇక్కడ ఏర్పాటు కానుందని వెల్లడించారు. 1995లో కంప్యూటర్లపై ఇలాంటి దుష్ప్రచారమే చేశారని, అప్పుడు ప్రభుత్వం వెనక్కి తగ్గి ఉంటే హైదరాబాద్ నేటి ఐటీ హబ్‌గా ఎదిగేది కాదని లోకేశ్ వ్యాఖ్యానించారు. అభివృద్ధి జరుగుతున్నప్పుడు పర్యావరణంపై కొంత భారం ఉంటుందని, కానీ దాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. రాజకీయ లబ్ధి కోసం చేసే దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలను కోరారు.

# అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ పాత్రికేయులు ఓ బయ్యా.

**దాతల సహాయం కోసం ఎదురుచూపులు.**

**పాత్రికేయ వృత్తిలో...పేదరికం..ఆర్థిక సమస్యలు.**

**సేహాబాష్ అన్న వారు...ప్రాణం ఉన్నప్పుడే ఆదుకోండి.**

**మనము చేసే చిన్న సహాయం**

**ఓ కుటుంబం లో పెద్ద దిక్కు ను కాపాడుదాం.**

నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 19 ( నంది పత్రిక ) ప్రపంచంలో పైసా జీతం లేకపోయినా చిన్న సంఘటన జరిగిన క్షణాల్లో ప్రజలకు సమాచారం ఇచ్చే వృత్తి పాత్రికేయ వృత్తి. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా పాత్రికేయుల జీవితాలు ఉన్నాయి. పాత్రికేయ వృత్తిలో అడుగుపెట్టిన వారు కుటుంబసమస్యలు గాలికి వదిలేసి వృత్తికి న్యాయం చేయాలంటూ ఎండా, వాన,చలి,కరోనా,ప్రమాదాలు ఏమిజరిగినా ముందు ఉండి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా అన్ని విషయాలు ప్రజలకు,ప్రభుత్వాలకు చేరవేస్తున్నారు. ఇలా పాత్రికేయ వృత్తి లో కొన్నేళ్లుగా కొనసాగుతున్న సీనియర్ పాత్రికేయులు ఓ బయ్యా అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారు. పేదరికం,వృత్తిలో అంతంత ఆదాయం అందరికీ తెలిసిన విషయమే. పేదరికంతో ఖరీదైన వైద్యం చేయించుకోలేక ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ రోగుల వైద్యం చేయించుకోవడం కంట తడిపెట్టిస్తుంది. వైద్య ఖర్చులకు డబ్బులు లేక విధిలేని పరిస్థితుల్లో దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. వివరాల్లోకి వెళితే నంద్యాల చెందిన సీనియర్ పాత్రికేయులు బాల ఓ బయ్య విశాలాంధ్ర దినపత్రికలో పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్తలు సేకరిస్తూ గ్రామీణ సమస్యలు అధికారుల దృష్టికి తీసు కొచ్చేవారు. పాత్రికేయులు,అధికారులతో కలిసిపోయే మనస్త్వం ఉండడం విశేషం. ప్రభుత్వాలు ఎన్ని మారినా పాత్రికేయుల జీవితాలు మారడం లేదు. ఎన్నికల సమయంలో ప్రతి పార్టీ నేతలు ముందుగా చెప్పే పెద్ద తీర్చలేని మాట పాత్రికేయులకు ఉచిత ఇళు ,,ప్రతి నెల గౌరవ వేతనం అని పచ్చి నిజం చెపుతారు. ఎన్నికలు అయిపోతాయి అందరికీ గౌరవ వేతనాలు 5 వేలు కానీ 10 వేలు కానీ ఇస్తారు. పాత్రికేయులకు ఇచ్చేటప్పటికీ అంతా నీటిమీద రాత అన్న చందంగా మారిపోతుంది. కుటుంబ సమస్యలు,ఆర్థిక సమస్యలకు తట్టుకొని జీవనం సాగిస్తున్న పాత్రికేయులకు ఆరోగ్య సమస్యలు వస్తె ఎవరికి చెప్పుకోలేని బాధ. ఇటీవలనే ఇద్దరు పాత్రికేయులు కళ్ళ ముందే మృతి చెందిన విషయం తెలిసిందే. ఆర్థిక ఇబ్బందులు ఒక వైపు,కుటుంబ పెద్ద కోల్పోతే ఆ కుటుంబ పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోండి. సేహాబాష్ అన్న వారు...



చిన్న సహాయం చేస్తే ఆ కుటుంబ పెద్ద దిక్కును కాపాడుకున్న వారం అవుతాము. ఆరోగ్యం క్షీణించకముందే మెరుగైన వైద్యం కోసం ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న సీనియర్ పాత్రికేయుడు కి సహాయం చేయండి. ప్రస్తుతం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దాతల కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు 8500615748 సెల్ నెంబర్ కు ఫోన్ పే చేయాలని అర్థిస్తున్నారు. ప్రతి ఒక్కరు రోజు ఎంతో ఖర్చు పెడుతుంటారు,మనము చేసే చిన్న సహాయం ఓ కుటుంబాన్ని కాపాడిన వారం అవుతాము. మనసున్న వారందరూ చేతనైన సహాయం అందిస్తారని ఆశిస్తున్నారు.

# ఈ నెలాఖరు కల్లా చెత్త నిర్వహణ ప్లాంట్ అందుబాటులోకి తేవాలి.





**సెప్టెంబర్ లోపు రామాపురం డంపింగ్ యార్డు చెత్త నిర్వహణ పూర్తి కావాలి .**

**సుడిగాలి పర్యటన చేసిన కమిషనర్ ఎం. జయకృష్ణ.**

తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 19 నంది పత్రిక నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తూకివాకం వద్ద చేపట్టిన చెత్త నిర్వహణ ప్లాంట్ (ప్రాసెసింగ్ ప్లాంట్) నిర్మాణ పనులను నాణ్యతతో ఈ నెలాఖరు లోపు పూర్తి చెయ్ అందుబాటులోకి తేవాలని, పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను హెచ్చరించారు. బుధవారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ సుడిగాలి పర్యటన చేశారు. నగరంలో పారిశుధ్య పనులతో పాటు తూకివాకంలో నిర్మిస్తున్న ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణ పనులను, తడి, పొడి చెత్త, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ల పనితీరు, రామాపురం డంపింగ్ యార్డు వద్ద జరుగుతున్న చెత్త నిర్వహణ పనులను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ముందుగా తూకివాకం వద్ద జరుగుతున్న వేస్ట్ ప్రాసెసింగ్ (చెత్త నిర్వహణ)ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలించి పనుల ఆలస్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. చేయాల్సిన మేర పనులు జరగడం లేదని, పనిచేసే వారి సంఖ్య పెంచి, యంత్రాల వాడకాన్ని పెంచి ఇచ్చిన గడువు లోపు పనులు పూర్తి చేసి, ప్లాంట్ ను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత ప్రాజెక్ట్ పనుల నిర్మాణంలో ఆలస్యం చేస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తడి, పొడి చెత్త ప్లాంట్లు, గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల ప్లాంట్ పనితీరును పరిశీలించారు. భవన నిర్మాణ వ్యర్థాలను సేకరించి లోతట్టు ప్రాంతాల్లో ఎత్తు పెంచడం, నూతన రోడ్ల ఏర్పాటు వంటి వాటిలో వినియోగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రామాపురం వద్ద గల డంపింగ్ యార్డును పరిశీలించారు. ప్రతి రోజు ఎంత చెత్త నిర్వహణ చేస్తున్నారు, ఎందుకు వినియోగిస్తున్నారు, ఇంకా ఎంత చెత్త ఉంది, ఇప్పటి లోపు పూర్తి అవుతుందనే విషయాలను తెలుసుకుని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని రోజుల్లో జరగాల్సినంత పని జరగక పోవడం పట్ల నిర్వాహక సిబ్బందిని మందలించారు. ఇప్పటి వరకు ఉన్న మొత్తం చెత్త సెప్టెంబర్ మూడవ వారానికల్లా నిర్వహణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్లాంట్ లో ఏరోజుకారోజు చేసిన పనిని రికార్డ్ చేసి సంబంధిత అధికారులను అప్పగించాలని నిర్వాహకులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.రమణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, ఉన్నారు.





# "నంద్యాల 36వ వార్డులో ఇంటింటికీ తెలుగుదేశం

## మహిళలకు అండగా కూటమి ప్రభుత్వం ఎన్.ఎం.డి.ఫిరోజ్"







నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 19 ( నంది పత్రిక ) నంద్యాల పట్టణంలోని 36వ వార్డు రామకృష్ణ స్కూల్ వద్ద వార్డు ఇంచార్జ్ మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఇంటింటికీ తెలుగుదేశం" డోర్ టు డోర్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ గడుపాటి నారాయణ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను, లబ్ధిదారులను నేరుగా కలుసుకుని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. స్త్రీ శక్తి పథకం విజయవంతంగా కొనసాగుతున్న సందర్భంగా వార్డులోని మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు కలుగుతున్న ప్రయోజనాలను నేరుగా వారిని అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఈ పథకం ద్వారా తమకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫిరోజ్ గారు మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు,అనేక సంక్షేమ పథకాలలో మహిళలను ప్రధాన లబ్ధిదారులుగా గుర్తించి, ఆర్థిక ప్రయోజనాలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటోంది. మహిళల ఆర్థిక స్వావలంబన, కుటుంబ ఆర్థిక భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, వారి జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ మారుతి ప్రసాద్, టీడీపీ నాయకులు నాగరాడోన సుధీర్, ఉదయ్ కుమార్, పుల్లయ్య, శేఖర్ రెడ్డి, వాసు, సునీల్ కుమార్, చంటి, దాసు, సాయికృష్ణ, శివ శంకర్, నూర్బాషా,రాఘవేంద్ర,టీడీపీ మహిళ నాయకురాలు వెంకటలక్ష్మి, మాధవి, మేరీ, సుజాత, జ్యోష్న, రాజేశ్వరి, మల్లిక, రాగిణి, పద్మ పాల్గొన్నారు



# శ్రవణ లోపంతో బాధపడుతున్న నిరుపేద కార్మికుడికి శ్రవణ యంత్రం (హియరింగ్ ఎయిడ్) అందజేత

**స్పందించి సాయం అందించిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి**



నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 19 ( నంది పత్రిక ) నంద్యాల పట్టణంలోని రాజ్ టాకీస్ సమీపంలో గల రజాక్ ఏజెన్సీస్ సైకిల్ షాపులో పనిచేస్తున్న నూర్ ఖాజా అనే నిరుపేద కార్మికుడికి శ్రవణ లోపం ఉన్నట్లు తెలుసుకున్న నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి. ఫిరోజ్ తక్షణమే స్పందించారు. నూర్ ఖాజా తీవ్రమైన వినికిడి సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా, మానవతా దృక్పథంతో ఫిరోజ్ గారు ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి దృష్టికి తీసుకెళ్లారు. చైర్మన్ నారాయణ స్వామి సహకారంతో వెంటనే నూర్ ఖాజా కు అవసరమైన ఉచిత శ్రవణ యంత్రాన్ని (హియరింగ్ ఎయిడ్) మంజూరు చేయించారు. ఈ రోజు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూర్ ఖాజాకు ఈ శ్రవణ యంత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు నూర్ ఖాజా మాట్లాడుతూ తన సమస్యను విని స్పందించి, వినికిడి యంత్రాన్ని అందించేందుకు సహకరించిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. నిరుపేదల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న టీడీపీ నాయకత్వానికి రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

# శ్రీ మద్దులేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లో శ్రావణ మాస సామూహిక శ్రీ వరలక్ష్మీ వ్రతం.





బేతంచెర్ల ఆగస్టు 19 ( నందిపత్రిక ). నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్. రంగాపురం గ్రామ పరిధిలో కొలువై ఉన్న లక్షలాది భక్తుల ఆరాధ్య దైవం, ప్రముఖ వైష్ణవ క్షేత్రమగు శ్రీ మద్దులేటి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో శ్రావణ మాస సామూహిక శ్రీ వరలక్ష్మీ వ్రత మహోత్సవం ను దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా,ఆహ్లాద కరమైన, సుందర వాతావరణంలో, వేలాది సువాసినుల నడుమ,వరలక్ష్మీ కటాక్షము,స్థిర నివాసమైన శ్రీ స్వామి వార్ల సన్నిధి యందు, శ్రీ పరాభావ నామ సంవత్సర శ్రావణ శుద్ధ నవమి శుక్రవారం (21/8/2026),ఉదయం 11గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించ బడును. శుక్రవారం ఉదయం 5 గంటలకు శ్రీ లక్ష్మి దేవి, శ్రీ స్వామి వార్లకు పంచామృత అభిషేకము,విశేష ద్రవ్య అభిషేఖము,తిరుమంజనం,సహస్రనామార్చన,ప్రత్యేక పూజలు,మహా మంగళహారతి నిర్వహించ బడును. అలాగే ఉదయం 10 గంటలకు శ్రీ వరలక్ష్మి అమ్మవారికి భాజా భజంత్రిలతో వ్రతవేదిక వద్దకు స్వాగతకార్యక్రమము,అమ్మవారికి (తిరుమంజనం),విశేష ద్రవ్య అభిషేఖము నిర్వహించ బడును. అనంతరం 11 గంటలకు సామూహిక శ్రీ వరలక్ష్మి వ్రత మహోత్సవము, మధ్యాహ్నం ఒంటి (1) గంటకు అన్న ప్రసాద కార్యక్రమం జరుగునని ఉప కమీషనర్ & శ్రీ మద్దులేటి స్వామి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు బుధవారం తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, ఈ సామూహిక శ్రీ వరలక్ష్మివ్రత మహోత్సవముల కార్య క్రమాలలో పాల్గొని విజయ వంతం చేయాలని ఈఓ, దేవస్థానం పురోహితులు మరియు దేవాలయ సిబ్బంది కోరుతూ తెలియ జేశారు.

# పచ్చని చెట్లని నరికేసిన వారిని అధికారులు కఠినంగా శిక్షించాలి.





నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 19 ( నంది పత్రిక ) దీబగుంట్ల – బాబానగర్ రహదారిలో ఉన్న పచ్చని చెట్లను నరికేసిన వారిని కఠినంగా శిక్షించాలని సూర్య సేన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టేక్కె మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ దేరంగుల చంద్రశేఖర్ మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః వృక్షాలను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి అని తెలిసి కూడా పాఠశాల యాజమాన్యం రహదారి వెంబడి ఉన్న చెట్ల వలన తమ పాఠశాల ప్రాంగణం కనబడడం లేదని అమానుషంగా 462 చెట్లను నరికి వేయడం చాలా దారుణం అన్నారు. ఇంతకుముందు కూడా ఇలాగే శ్రీనివాస్ సెంటర్లో ప్రతాప్ థియేటర్ పక్కన ఉన్న పాలకొమ్మ చెట్టు అనే వృక్షాన్ని ఆక్రమణదారులు తొలగించేశారు. వీళ్లు ఇంత బరితెగించడానికి రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరని ఇంతటి దారుణాలకు ఒడి కడుతున్నారు. కావున ప్రజలు ఇకనైనా మేల్కొని ఇలాంటి వాళ్ళని ప్రశ్నించడమే కాకుండా గట్టిగా బుద్ధి చెప్పాలి. అలాగే నంద్యాల పట్టణంలో ఎక్కడ చూసినా అనుమతులు లేకుండా కొందరు స్వార్థపరులు చెట్లను నరికిస్తున్నారు. కావున దోషులను కఠినంగా శిక్షించేంతవరకు తమ నిరసన కార్యక్రమం రోజు కొనసాగుతుందని తెలియజేశారు. పచ్చని చెట్లని నరికేసిన వారిని అధికారులు కఠినంగా శిక్షించాలి. దీబగుంట్ల – బాబానగర్ రహదారిలో ఉన్న పచ్చని చెట్లను నరికేసిన వారిని కఠినంగా శిక్షించాలని సూర్య సేన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టేక్కె మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ దేరంగుల చంద్రశేఖర్ మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః వృక్షాలను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి అని తెలిసి కూడా పాఠశాల యాజమాన్యం రహదారి వెంబడి ఉన్న చెట్ల వలన తమ పాఠశాల ప్రాంగణం కనబడడం లేదని అమానుషంగా 462 చెట్లను నరికి వేయడం చాలా దారుణం అన్నారు. ఇంతకుముందు కూడా ఇలాగే శ్రీనివాస్ సెంటర్లో ప్రతాప్ థియేటర్ పక్కన ఉన్న పాలకొమ్మ చెట్టు అనే వృక్షాన్ని ఆక్రమణదారులు తొలగించేశారు. వీళ్లు ఇంత బరితెగించడానికి రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరని ఇంతటి దారుణాలకు ఒడి కడుతున్నారు. కావున ప్రజలు ఇకనైనా మేల్కొని ఇలాంటి వాళ్ళని ప్రశ్నించడమే కాకుండా గట్టిగా బుద్ధి చెప్పాలి. అలాగే నంద్యాల పట్టణంలో ఎక్కడ చూసినా అనుమతులు లేకుండా కొందరు స్వార్థపరులు చెట్లను నరికిస్తున్నారు. కావున దోషులను కఠినంగా శిక్షించేంతవరకు తమ నిరసన కార్యక్రమం రోజు కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రదీప్ రెడ్డి, జీనత్ ట్రస్ట్ చైర్మన్ జెక్కి బాయ్, సంజీవ, ఉదీప్, మధు, సాహెబ్, నాగేశ్వరరావు, స్వామి పాల్గొన్నారు



# ఏ పి ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లుకు శాసనసభ ఆమోదం

### సభలో బిల్లును ప్రవేశపెట్టిన న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్



**అమరావతి, ఆగస్టు19. నంది పత్రిక:** ఆంధ్రప్రదేశ్ ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లు-2026కు శాసనసభ ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన శాసనసభ సమావేశాలు మూడవ రోజున స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రవేశపెట్టారు. మంత్రి ఫరూక్ ప్రవేశపెట్టిన బిల్లులోని ముఖ్యాంశాలను ప్రశంసిస్తూ వాటికి పూర్తి మద్దతు తెలుపుతూ బిల్లును ఆమోదించాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు. ప్రతిపాదనలకు సభ్యుల ఆమోదంతో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. బిల్లును ప్రవేశపెట్టినప్పుడు మంత్రి ఫరూక్ శాసనసభలో బిల్లు ముఖ్య ఉద్దేశంతో పాటు అందుబాటులోకి వచ్చే సులభతరమైన విధానాలను వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లుతో రాష్ట్రంలో విశ్వాస-ఆధారిత నియంత్రణ చట్రాన్ని పెంపొందించుటకు, పౌరుల యొక్క జీవన సౌలభ్యాన్ని మెరుగుపరుచుటకు, మరియు కార్యకలాపాల నిర్వహణను వేగవంతం చేయుటను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం సూచించిన నియంత్రణల సడలింపు, అనుసరణ భారాన్ని తగ్గించే సంస్కరణలను అమలు చేయడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీస్ చట్టం-1999 క్రింద ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అంతర్జాతీయ ప్రమాణాలు మరియు మార్గదర్శకాలు ఆధారంగా ఉండేలా చేసినట్లు, నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు సంబంధించిన ప్రస్తావనలను తొలగించినట్లు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ల పునరుద్ధరణ కోసం థర్డ్-పార్టీ ఫైర్ ఆడిట్ ఏజెన్సీలు అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి, వాటి ఎంపానెల్మెంట్కు సంబంధించిన అర్హతలు, ప్రమాణాలు, విధులు, పర్యవేక్షణ మరియు క్రమశిక్షణా నిబంధనలను చేర్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ సింగిల్ విండో క్లియరెన్స్ చట్టం- 2002 కింద పరిశ్రమలకు సంబంధించిన అనుమతులపై క్రమబద్ధమైన పర్యవేక్షణ, స్పష్టమైన అధికారాలతో పాటు తప్పనిసరి ఎస్కలేషన్ అథారిటీతో కూడిన రాష్ట్ర మరియు జిల్లా కమిటీలతో కూడిన రెండు అంచెల సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ప్రతిపాదించామని వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ చట్టం- 2017 లో సేవలు తిరస్కరించబడినప్పుడు లేదా నిర్ణీత గడువులో అందించనప్పుడు, దరఖాస్తుదారులు తామే స్వయంగా అప్పీల్ దాఖలు చేయాల్సిన అవసరం లేకుండా ఆటో-అప్పీల్ విధానం ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఏదైనా సేవ తిరస్కరించబడినా లేదా నిర్ణీత గడువులో అందించబడకపోయినా, అప్పీల్ స్వయంచాలకంగా దాఖలైనట్లుగా పరిగణించ బడు తుందన్నారు. అప్పీలేట్ అథారిటీ 21 రోజుల్లోపు ఆ అప్పీల్‌ను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైతే సేవను అందించమని ఆదేశించడంతో పాటు, పరిహారం చెల్లించాల్సిందిగా కూడా ఆదేశించవచ్చునని పేర్కొంటూ మంత్రి ఫరూక్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును ప్రవేశపెట్టగా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

# ఎత్తిపోతల పథకాల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే నిర్ణయాన్ని విరమించుకోవాలి

**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 19 . (నంది పత్రిక ):** రాష్ట్రంలో నీటిపారుదల కార్పొరేషన్ (ఏపీఎస్ఐడీసీ) ఆధ్వర్యంలోని 789 ఎత్తిపోతల పథకాల నిర్వహణను పదేళ్ల పాటు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దుర్మార్గమైందని ఆంధ్రప్రదేశ్ రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు సాగునీరు అందించే కీలకమైన ఎత్తిపోతల పథకాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల ప్రభుత్వ బాధ్యతనుంచితప్పించుకోవడమే కాకుండా ప్రజాధనం భారీగా ప్రైవేటు సంస్థలకు దారిమళ్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఏపీఎస్ఐడీసీ ఆధ్వర్యంలోని ఈ 789 ఎత్తిపోతల పథకాల ద్వారా 7.49 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఇందులో సుమారు 5 లక్షల ఎకరాల్లో ఒక పంట, 2.49 లక్షల ఎకరాల్లో రెండు పంటలు సాగవుతున్నాయి. ఈ పథకాల నిర్వహణకు ఏడాదికి ఎకరానికి రూ. 4,911 చొప్పున ఖర్చవుతుందని అధికారులు అంచనా వేయగా, విద్యుత్ ఛార్జీలు, ఉద్యోగుల జీతాలు తదితరాలను కలిపితే నిర్వహణ వ్యయం మరింత భారీగా పెరుగుతోంది. వాస్తవానికి ఏపీఎస్ఐడీసీ పరిధిలో 1,023 ఎత్తిపోతల పథకాల కింద 8.42 లక్షల ఎకరాలు సాగయ్యేవి. నిర్వహణ, మరమ్మతుల పట్ల ప్రభుత్వాలు సంవత్సరాల తరబడి నిర్లక్ష్యం చేయడంతో 623 పథకాలు దెబ్బతినగా, 234 పథకాలు పూర్తిగా పనిచేయకుండా పోయాయి. అనేక పథకాలకు వాచ్‌మెన్లు లేకపోవడంతో మోటార్లు, ఇతర పరికరాలు దొంగిలించబడ్డాయి. పంప్‌హౌస్‌లు, విద్యుత్ వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయి. ఈ దుస్థితికి ప్రధాన కారణం ప్రభుత్వాల నిర్లక్ష్యమేనని వారు ధ్వజమెత్తారు. ఇప్పుడు వాటినిపునరుద్ధరించాల్సిన బాధ్యతనుంచితప్పించుకునేందుకు నిర్వహణ వ్యయం ఎక్కువగా ఉందనే సాకుతో ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం సరైంది కాదని విమర్శించారు. ప్రభుత్వంలోని అన్ని సంస్థలు, వ్యవస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ పోతే ప్రభుత్వం ఏం చేయాలి? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. సాగునీటి పథకాలు, వాటి నిర్వహణ పూర్తిగా ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలని, వాటిని లాభాపేక్షతో పనిచేసే ప్రైవేటు సంస్థలకు అప్పగించడం రైతుల ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎత్తిపోతల పథకాల నిర్వహణ, మరమ్మతులు, నిధుల కేటాయింపులు, పథకాల పునరుద్ధరణ, ప్రైవేటీకరణ ప్రతిపాదన తదితర అంశాలపై సమగ్రంగా చర్చించాలని డిమాండ్ చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో రైతులతో, రైతు,కౌలురైతుల సంఘాలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకోవాలని



కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా పదేళ్లపాటు ప్రైవేటు ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడం బాధ్యతారాహిత్యమైన నిర్ణయమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, మరమ్మతులు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగించేలా చర్యలు చేపట్టాలని పాడైన పథకాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి, రైతులకు సాగునీరు అందేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎ.కాటమయ్య,పి.జమలయ్య డిమాండ్ చేసారు.

# దళిత వాడ లపై నిర్లక్ష్యం తగదు

**-నెల రోజులైనా మురికి కాల్వలు శుభ్రం చేయడం లేదు**

**-కంపు లోనే జీవిస్తున్నాం. అనారోగ్యల బారిన పడుతున్న ఎవరూ పట్టించుకోలేదు.ప్రజల ఆవేదన**

**-నూనెపల్లి హరిజన వాడలో డ్రైనేజీ సమస్యలు తిష్ట**

**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 19 . (నంది పత్రిక ):** నంద్యాల జిల్లా కేంద్రంలోని నూనెపల్లి హరిజన పేట లో పారిశుధ్యం చాలా అద్వాన్నంగా,తీవ్రంగా ఉంది. కానీ డ్రైనేజి సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నూనెపల్లి - హరిజన పేటలో మురికి కాల్వలు తీసే నాధుడే కరువయ్యారని . నెలకు ఒక్కరోజు, 2 నెలలకు ఒక్కసారి మురికి కాల్వలు తీసిపోతున్నారని, మళ్లీ వాళ్లు వచ్చేవరకు మురికి కాల్వలలో చెత్త, చెదారం పేరుకుపోవాల్సిందే నాని, కాలువలు రెగ్యులరగా తీయకపోవడంతో దూర్వసన తో అల్లాడిపోతున్నామని అక్కడి దళితులు సామాజిక శాంఖారావం లో భాగంగా పాదయాత్ర కు వెళ్లిన నాయకులకు తమ సమస్యలను వివరించారు. ఇక్కడ కాలనీ లలో చిన్న చిన్న సందుల్లో ఉన్న కాలువలు తీయకపోవడంతో వర్షం పడితే చాలు డ్రైనేజి నుండి వచ్చే నీళ్లు, వర్షపు నీరు మోకాళ్ల వరకు వస్తుందని బయటికి రావాలంటే ఇబ్బందిగా ఉంటుందని అక్కడి నివాసిత ప్రజలు నాయకులతో వాపోయారు. మీరైనా పట్టించుకోండి.. మాసమస్యలు పరిష్కరించండి అంటూ నాయకులతో మొర పెట్టుకున్నారు. నెలలు తరబడి మురికి కాల్వలు సిల్ట్ తీయకపోవడంతో దుర్వాసనతో అల్లాడిపోతున్నామని స్థానికంగా దళిత ప్రజలు వాపోతున్నారని అన్నారు . ప్రతి ఇంటికి మంచి నీరు అందేలా పైపు లైన్ వేయాలని, కుళాయి లను వెయ్యాలని మున్సిపల్ అధికారుల చుట్టూ తిరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని, ఇంటి పట్టాలు చూపాలని చెప్పుతూ కాలయాపన చేస్తున్నట్లు మరో వ్యక్తి నాయకులకు సమస్యను విన్నమించారు. ఈ కార్యక్రమం లో కెవిపిస్ జిల్లా నాయకులు లక్ష్మణ్, పుల్లా నరసింహులు, సీఐటీయూ సీనియర్ నాయకులు తోట. మద్దులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కే మహమ్మద్ గౌస్ పి వెంకట లింగం డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ వీరితోపాటు శ్రీనివాసులు,




వెంకటరావు, షఫీ, జాకీర్ పాల్గొని మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు తక్షణమే హరిజన పేటలో నెలకొన్న డ్రైనేజి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హరిజన వాడలపైన అధికారులు, ప్రజా ప్రతినిధులు చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించాకుంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చెప్పడతామని పై సమస్యల పరిష్కారం కోసము ఈ నెల 24వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే దళితవాడలోని సమస్యలను పరిష్కారం చేయడం కోసం ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది . సీఐటీయూ, కెవిపిఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీజీపీ ప్రధాన కాలువలో గండిపెట్టిన రైతులు



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 19:** ఎల్లినో ప్రభావం కారణంగా ఖరీఫ్ సీజన్లో రైతులు తమ పంట పొలాలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. రైతులు తమ పంట పొలాలను కాపాడుకునే ప్రయత్నంలో అడ్డ దారులు తొక్కుతున్నారు. తెలుగు గంగ ప్రధాన కాలువకు సంబంధించి తొమ్మిదో కిలోమీటర్ వద్ద కొందరు రైతులు రెండు రోజుల క్రితం ట్రాక్టర్ ఇంజన్ ద్వారా గన్ను ఏర్పాటు చేసి కాలువలో రంధ్రం చేశారు. గండి పడిన చోట యూటి ( అండర్ టన్నెల్ ) ఉండటంతో దాని ద్వారా నీరు మద్దిలేరు వాగు లో కలుస్తూ ఉంది. ఈ నీటితో మోటార్లు వేసుకొని రామాపురం గ్రామానికి చెందిన కొందరు రైతులు నీళ్లు పారించుకుంటున్నారు. వాస్తవానికి గత రెండు నెలలుగా తెలుగు గంగ కాలువలో నీటి ప్రవాహం నిలిచిపోయింది. తెలుగు గంగ మెయిన్ గేటు వద్ద లైనింగ్ పనులు జరుగుతూ ఉండటంతో లీకేజీ వాటర్ ను మట్టితో కప్పివేశారు. నారాయణపురం, వెలుగోడు మండలం మోత్కూరు గ్రామానికి చెందిన రైతులు కొందరు రెండు రోజుల క్రితం తెలుగు గంగ అధికారులను కలిశారు. పశువులకు, రజకులకు సైతం నీటి వసతి లేక అల్లాడిపోతున్నారని గంగ అధికారులతో మొరపెట్టుకున్నారు. దీనితో ప్రధాన గేట్లో వేసిన మట్టిని నీటి అవసరాల కోసం కొంతమేరకు తొలగించారు. కాలువలో నీళ్లు వస్తున్నాయని విషయం తెలుసుకున్న రామాపురం గ్రామానికి చెందిన రైతులు కొందరు తెలుగు గంగ కాలువలో రంధ్రం చేశారు. ఈ సంఘటన రెండు రోజుల క్రితం జరిగింది. యూటీ ద్వారా నీళ్లు తక్కువగా వస్తున్నాయని తెలుసుకున్న రైతులు మరోసారి రంధ్రం వేసేందుకు ప్రయత్నాలు చేశారని తెలుస్తోంది. ఈ విషయం పోలీసు దృష్టికి వెళ్లడంతో రైతులను సుతి మెత్తగా మందలించినట్లు తెలుస్తోంది. కాల్వలో రంధ్రం వేశారన్న విషయం తెలుసుకున్న తెలుగు గంగ అసిస్టెంట్ ఇంజనీరు శివనాయక్, పోలీస్ స్టేషన్కు వచ్చి ఎస్ఐతో ఈ విషయంపై చర్చించారు. రామాపురం గ్రామానికి చెందిన కొందరు రైతులను పోలీస్ స్టేషన్కు పిలిపించి విచారించినట్లుగా తెలుస్తోంది. స్టేషన్ వద్దే గంగాధికారులతో రైతులు వాగ్వివాదానికి దిగినట్లుగా తెలుస్తోంది. కాలువలో రంధ్రం పడిన చోట గంగ అధికారులు రింగుబండ్ వేసే



ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులు మరోసారి గండి పెడితే తరువాత తీసుకోవాల్సిన చర్యలపై ఆలోచిస్తున్నారు. రాత్రిపూట గంగ కాల్వ వెంట నిఘా పెంచాలంటే సాధ్యం కానీ పరిస్థితులు నెలకొంటూ ఉన్నాయి. అదీ కాక ఈ ప్రాంతంలో పులుల సంచారం ఉండటంతో గంగ కాలువల వద్ద నిఘా ఉంచేందుకు అధికారులు జంకే పరిస్థితి నెలకొంటూ ఉంది. కాల్వకు గండిపెట్టిన పలువురు రైతులపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. పరిస్థితి సమస్యాత్మకం కాకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.



# మహిళల రక్షణ కోసమే శక్తి యాప్



**కొత్తపల్లి - నంది పత్రిక :** మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన " శక్తి యాప్ మరియు శక్తి వాట్సాప్ సేవలను వినియోగించుకోవాలని శక్తీ టీం సిబ్బంది పాములపాడు ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్, ఉమెన్ హోమ్ గార్డ్ సుప్రియలు అన్నారు బుధవారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనం లో మండల పొదుపు సంఘం,మహిళా లీడర్ల కు ఏపీఎం పుల్లయ్య ఆధ్వర్యంలో " శక్తీ యాప్ అవేర్నెస్ ప్రోగ్రాంన్నీ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల రక్షణ కొరకై శక్తి యాప్ మరియు శక్తి వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలిపారు ఈ యాప్ లో మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి, బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయాలని, బాల్య వివాహాలను చేస్తున్నట్లయితే 112 , 1098 గాను ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయలన్నారు ఫేక్ కాల్స్ వల్ల మెసేజ్ ల వల్ల జాగ్రత్తగా ఉండాలన్నారు ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లలలో శక్తీ యాప్ డౌన్ లోడ్ చేసుకొని అత్యవసర సమయాలలో శక్తీ యాప్ ను వాడాలని ,శక్తీ యాప్ ను మహిళలు రక్షణ కొరకై తప్పకుండా ఉపయోగించుకోవాలన్నారు పొదుపు మహిళలతో యాప్ ను డౌన్లోడ్ చేయించి వారికి అవగాహన కల్పించమన్నారు. అదేవిధంగా మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు రక్షణగా " హెల్మెట్ " పెట్టుకొని ప్రయాణం చేయాలని సూచించారు

# జర్నలిస్టులకు రైల్వే రాయితీ విషయం ప్రధాని దృష్టికి తీసుకెళతా

**- అమలయ్యేందుకు తప్పకుండా కృషి చేస్తా**

**- ఎంపీ బస్తిపాటి నాగరాజు**


**- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఎంపీకి వినతి పత్రం అందజేత**




**కర్నూలు, ఆగస్టు 19. నంది పత్రిక:** కరోనా సమయంలో రద్దు చేసిన జర్నలిస్టు రైల్వే రాయితీని పునరుద్ధరించాలని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఈఎన్.రాజు, రాష్ట్ర సమితి సభ్యుడు వైవీ కృష్ణారెడ్డి,ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర సమితి సభ్యులు వైవీ కృష్ణారెడ్డి, జిల్లా కోశాధికారి అంజి, జిల్లా సహాయ కార్యదర్శి శివ రాజ్ కుమార్, సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి కోరారు. ఈ మేరకు కర్నూలు జిల్లా కేంద్రంలోని సమాచార శాఖ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1959 నుంచి జర్నలిస్టులకు రైల్వే ప్రయాణ ఛార్జీల 50 శాతం రాయితీ అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తూ వచ్చిందన్నారు. 2010 లో జర్నలిస్టులతో పాటు వారి భార్య, పిల్లలకు కూడా రాయితీని వర్తింపజేశారన్నారు. అయితే కరోనా సమయం లో జర్నలిస్టుల తో పాటు అందరికి రాయితీలు రద్దు చేశారన్నారు. అయితే కరోనా తగ్గిన తర్వాత ఒక్క జర్నలిస్టు రాయితీ మాత్రం రద్దు నుంచి మినహాయింపునకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రధానితో చర్చించి రైల్వే రాయితీ తిరిగి కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఎంపీ స్పందిస్తూ.. జర్నలిస్టుల రైల్వే రాయితీ సమస్యను ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళతానని, 20వ తేదీ సికింద్రాబాద్ లో కేంద్ర మంత్రులు, ఎంపీలతో కీలక సమావేశం ఉందని, ఈ విషయాన్ని అక్కడ ప్రస్తావించి న్యాయం చేకూరేలా ప్రయత్నం చేస్తానని హామిచ్చారు. జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం ఎల్లపుడు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జర్నలిస్టులు కూడా కూటమి చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో నగర అధ్యక్ష, కార్యదర్శులు చిన్న నాగేశ్వర రావు, బీ మల్లికార్జున, నాయకులు హరికృష్ణ, ఏపీ ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, జిల్లా అధ్యక్షుడు ఎన్ సుధాకర్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# కీటక జనిత వ్యాధుల నియంత్రణపై రాష్ట్ర ఎంటమాలజిస్ట్ ఆకస్మిక తనిఖీలు



**పోరుమామిళ్ల, ఆగస్టు 19 (నంది పత్రిక):** రాష్ట్ర ఎంటమాలజిస్ట్ పి. కొండారెడ్డి బుధవారం కలసపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబొరేటరీల్లోని రికార్డులు, నివేదికలను పరిశీలించారు. ఫీల్డ్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు, ఎం పీ హెచ్ ఏ ల వద్ద ఉన్న యాక్టివ్ బ్లడ్ సాంపిల్స్‌తో పాటు సంబంధిత రికార్డులను పరిశీలించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ, లార్వాల్ సర్వే, ఫీవర్ సర్వేలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ల్యాబ్ టెక్నీషియన్లకు మలేరియా స్లైడ్ పరీక్ష విధానంపై సూచనలు అందించారు. రాష్ట్ర ఎంటమాలజిస్ట్‌తో పాటు సబ్‌యూనిట్ ఆఫీసర్ టి. నరసింహారెడ్డి పాల్గొని జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంపై వివరించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు సాయితేజ, ల్యాబ్ టెక్నీషియన్లు స్వాతి, ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు రామతీర్థం, జయరామిరెడ్డి, సాధు సత్యనారాయణ, స్వామిరంగయ్య తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని వసతులు కల్పించండి

### - ఎంపిడిఓ మేరీ



**కొత్తపల్లి – నంది పత్రిక :** ఎన్నికల వేల పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అన్ని వసతలు కల్పించాలని సంబంధిత అధికారులకు ఎంపీడీఓ మేరి ఆదేశించారు. బుధవారం మండలంలోని శివపురం, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్లకు ఓటుహక్కును వినియోగించుకొనేందుకు వచ్చే ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. అలాగే నీటివసతి, కిటికిలు దెబ్బతిన్న వాటిని తిరిగిఅమర్చడం, టేబుల్లు, వికలాంగులకు ర్యాంపులు, ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు

# డి ఎల్ డి ఓ అన్వరా బేగం ఆకస్మిక సందర్శన

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 19 :** ఆత్మకూరు డి ఎల్ డివో అన్వరా బేగం బుధవారం బండి ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆకస్మికంగా సందర్శించారు. గ్రామాలలో ఎస్సీ ఎస్టీ బీసీలకు సంబంధించి రిజర్వేషన్ ఖరారుకుగాను, నిర్వహించే గుర్తింపు విధానంపై సమీక్ష నిర్వహించారు. గ్రామాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకుగాను, ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్వచ్చ రథం కార్యక్రమాన్ని ప్రజలు ఏ విధంగా వినియోగించుకుంటున్నారు అన్న అంశంపై ప్రత్యక్షంగా డి ఎల్ డి ఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గాయత్రి, కార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.



# సాక్షి పత్రికా తప్పుడు కథనాలను ఖండించిన కర్నూల్ తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** సాక్షి దినపత్రికలో జిల్లా తెలుగుదేశం పార్టీ పైన తప్పుడు వార్తను ప్రచురించిన అంశాన్ని పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ తీవ్రంగా ఖండించారు. వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి తెలుగుదేశం పార్టీ వారిపై తప్పుడు కథనాలను తన సాక్షి పేపరు చానల్స్ లో ప్రచారం చేయించడం కోత్తేమీకాదని కృష్ణమ్మ తెలియజేస్తూ తాను జిల్లా అధ్యక్షురాలు అయినది మొదలుకొని మంత్రి వర్యులు ఎమ్మెల్యేలతో ఇన్చార్జిలతోనూ ఎంతో సమన్వయంతో ముందుకు పార్టీని నడిపిస్తుంటే వైఎస్ఆర్సిపి వారు జీర్ణించుకోలేక ఇలా తప్పుడు ప్రచారానికి పూనుకున్నారని ఇందులో ఎలాంటి వాస్తవం లేదని కర్నూలు జిల్లా శాసనసభ్యులు ఇన్చార్జీలు మంత్రివర్యులతో అనునిత్యం సమన్వయపరచుకుంటూ పార్టీ ఉన్నత కోసం కృషి చేస్తుంటే రానున్న రోజులలో తమ ఉనికికి ఇబ్బందికరంగా ఉంటుందని వైసిపి వారు సాక్షి పత్రికలో ఇలాంటి తప్పుడు కథనాలు ప్రచురింపజేయడం సిగ్గుచేటని మరోసారి ఇలాంటి దుష్ప్రచారానికి పాల్పడితే మూల్యం చెల్లించుకోక తప్పదని ఘాటుగా హెచ్చరించారు, త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నందున తెలుగుదేశం పార్టీని ఎదుర్కోవడానికి వైసిపి వారికి చేతకాక వారి సాక్షి పత్రికలో ఇలాంటివి నిరాధారమైన కథనాలను ప్రచురిస్తున్నారని బీసీ మహిళ ఎదుగుదలను జీర్ణించుకోలేక ఇలా వ్యవహరిస్తున్నారని వారుఇలాగే వ్యవహరిస్తే వారికి తగిన బుద్ధి చెప్పవలసి వస్తుందని



హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్ గారు డీసీఎంఎస్ చైర్మన్ పై నాగేశ్వరావు యాదవ్ గారు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె నాగేంద్ర డైరెక్టర్లు ఎల్వీ ప్రసాద్ విజయ్ కుమార్ లక్ష్మీ నారాయణ పోతురాజు రవికుమార్ సత్రం రామకృష్ణుడు వెంకట్ రాముడు మాలిని డాక్టర్ ప్రవీణ్ కుంపటి కృష్ణుడు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు

# కర్నూలు జిల్లా త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

### డిసిసి అధ్యక్షులు బోయ క్రాంతి నాయుడు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లాలో తీవ్రంగా ఉన్న త్రాగునీటి సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది బోయ క్రాంతి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి వెలువడిన పత్రిక ప్రకటనలో క్రాంతి నాయుడు మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా త్రాగునీటి మౌలిక వసతులు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**సాధారణంగా 8,000 మంది జనాభాకు ఒక ఎస్ ఎస్** ట్యాంక్ ఉండాల్సిన పరిస్థితిలో, కర్నూలు జిల్లాలో ఏకంగా 62,000 మంది జనాభాకు ఒక ఎస్ ఎస్ ట్యాంక్ మాత్రమే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దీంతో గ్రామాలు, పట్టణాల్లో వేసవితో సంబంధం లేకుండా త్రాగునీటి కొరత నెలకొంటోంది. రాష్ట్రంలో అత్యధిక త్రాగునీటి సమస్య ఎదుర్కొంటున్న 28 జిల్లాల్లో మొదటి మూడు స్థానాల్లో హిందూపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాలు ఉండటం ఆందోళనకరం. అయితే త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ఈ జిల్లాల్లో మొదటి రెండు ప్రాంతాలకు సున్నా నిధులు కేటాయించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ప్రజల ప్రాథమిక అవసరమైన త్రాగునీటిని కూడా రాజకీయాలకు అతీతంగా అత్యంత ప్రాధాన్యతతో చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కర్నూలు జిల్లాలో త్రాగునీటి సమస్యకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా కొత్త ఎస్ ఎస్ ట్యాంకులు, పైప్‌లైన్లు, నీటి నిల్వ సామర్థ్యం పెంపు, అవసరమైన ఇతర మౌలిక వసతుల కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. అందువల్ల కర్నూలు జిల్లాతో పాటు తీవ్ర త్రాగునీటి సమస్య ఎదుర్కొంటున్న ప్రాంతాలకు ప్రభుత్వం తక్షణమే రూ.3,000 కోట్లు ప్రత్యేకంగా కేటాయించి, యుద్ధప్రాతిపదికన త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం.ప్రజలకు సురక్షితమైన, నిరంతర త్రాగునీరు అందే వరకు ప్రభుత్వం బాధ్యతాయుతంగా చర్యలు చేపట్టాలని క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు.

# శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం

**శ్రీశైలం ఆగస్టు 19(నంది పత్రిక)** లోక కల్యాణం కోసం దేవస్థానం (19.08.2026) ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది. కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితిరోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. ఈ ఉదయం సాక్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి. వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది. కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయా లలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.



# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం.



**వెలుగోడు ఆగస్టు 19 నంది పత్రిక:** వెలుగోడు మండల మరియు పట్టణ ఫోటోగ్రాఫర్లందరూ కలిసి బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఫోటోగ్రాఫర్ల సమక్షంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగోడు మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రహీమాన్, సీనియర్ ఫోటోగ్రాఫర్లు రామలింగం, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరులు, మల్లికార్జున, వెంకట్, నూర్, జబీవుల్లా, లింగస్వామి, షఫీ, జావిద్, పెద్దలింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

### -చరిత్రను భవిష్యత్తు తరాలకు నిక్షిప్తం చేసే కళ ఫోటోగ్రఫీ: డాక్టర్ రవి కృష్ణ



**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 19 . (నంది పత్రిక ):**బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నంది కేబుల్ లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వాసు, ఈనాడు దినపత్రిక నంద్యాల ఫోటోగ్రాఫర్ మురళి లకు లయన్స్ క్లబ్ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు.లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ అంతర్జాతీయ సంస్థ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ డాక్టర్ జి.రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జరుగుతున్న చరిత్రను భవిష్యత్తు తరాలకు నిక్షిప్తం చేసి కళ్ళ ముందు నిలిపే గొప్ప కళ ఫోటోగ్రఫీ అన్నారు. వాసు నంది కేబుల్ లో న్యూస్ ఎడిటర్ గా, ఫోటోగ్రాఫర్ గా, మురళి సుదీర్ఘకాలంగా ఫోటోగ్రాఫర్ గా, ప్రస్తుతం ఈనాడు దినపత్రిక నంద్యాల ఫోటోగ్రాఫర్ గా పాత్రికేయ రంగంలో విశిష్ట సేవలు చేశారని కొనియాడారు. నంద్యాలలో ఉన్న ఫోటోగ్రాఫర్లు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలోలయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్,జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు, నంద్యాల లయన్స్ క్లబ్ కార్యదర్శి మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్ సభ్యులు ఎం.పి.వి. రమణయ్య,తోట శ్రీనివాసులు,శివరాం రెడ్డి,రామయ్య,ప్రసాద్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ టీడీపీ.. 70 లక్షల ఇళ్లకు చేరువగా కార్యక్రమం

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం – రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహభరితంగా సాగుతోంది. ఈ కార్యక్రమం ప్రారంభమైన 24 రోజుల్లో పార్టీ శ్రేణులు మొత్తం 69.26 లక్షల కుటుంబాలను నేరుగా కలిశారు.

# రైతన్నలకు రాయితీపై గోకులం షెడ్లు, బహువార్షిక పశుగ్రాసం, బీమా సౌకర్యం..ఏ డి విక్టర్

**నందిపత్రిక –ప్యాపిలి** ప్యాపిలి మండల పరిధిలోని రైతులు, పశుపోషకుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పశుసంవర్ధక శాఖ ద్వారా పలు కీలక రాయితీ పథకాలను అమల్లోకి తెచ్చినట్లు ప్యాపిలి మండల పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఎస్. విక్టర్ తెలిపారు. మండలంలోని అర్హులైన రైతులందరూ ఈ క్రింది పథకాల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.అయన మాట్లాడుతూ పశువులకు నిరంతరం పోషకాహారం అందించేందుకు బహువార్షిక పశుగ్రాసాలను పెంచే రైతులకు విబిజీ రాంజీ పథకం ద్వారా ఉపాధి హామీ నిధుల నుంచి ఏడాది పాటు అయ్యే కూలీల వేతన ఖర్చులు మెటీరియల్ ఖర్చులను ప్రభుత్వం భరిస్తుంది. గొర్రెలు, మేకల పెంపకందారులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు పశు బీమా పథకాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీనికింద ఒక సంవత్సర కాలానికి గాను ఏకంగా 85% రాయితీతో గొర్రెలు, మేకలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నారు.సొంతంగా పశువుల షెడ్లు నిర్మించుకోలేని ఎస్సీ, ఎస్టీ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద పశుపోషకులను ఆదుకునేందుకు ప్రభుత్వం భారీ రాయితీ ఇస్తోంది: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 90% రాయితీతో 'గోకులం షెడ్డు' నిర్మాణం.గొర్రెలు,మేకలు కోళ్ల షెడ్ల నిర్మాణం కొరకు 70% రాయితీ అందజేయబడుతుంది. ఈ పథకాలకు సంబంధించిన పూర్తి వివరాలు, దరఖాస్తు ప్రక్రియ కోసం ప్యాపిలి మండలంలోని జలదుర్గం, చిన్న పొదిల్లా, డి. ఉషనాపురం, రాచర్ల ప్యాపిలి పశువైద్యశాలల సిబ్బందిని వెంటనే సంప్రదించాలని డాక్టర్ ఎస్. విక్టర్ తెలియజేశారు. రైతులు ఈ లబ్ధిని పొంది ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

# సామాజిక న్యాయానికి నిదర్శనం

### వడ్డెర బిడ్డ దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి కూటమి ప్రభుత్వానికి వడ్డెర సమాజం ధన్యవాదాలు!

**నందిపత్రిక –ప్యాపిలి** బీసీ, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ కూటమి ప్రభుత్వం మరోసారి నిరూపించిందని గవర్నర్ కోటా కింద అనంతపురం జిల్లాకు చెందిన వడ్డెర సామాజిక వర్గ నాయకురాలు దళవాయి రమాదేవిని ఎమ్మెల్సీగా నామినేట్ చేయడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా వడ్డెర సమాజంలో తీవ్ర ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. వడ్డెర కులస్తులను చట్టసభల్లోకి పంపి, వారి గళాన్ని శాసనమండలిలో వినిపింపజేస్తామని గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకుగానూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువగళం ప్రతిధ్వని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు వడ్డెర సామాజిక వర్గం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అఖిలభారత వడ్డెర సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు టీడీపీ రాష్ట్ర యువ నాయకులు చల్లా అనుదీప్ కుమార్ మాట్లాడుతూ... "మాట ఇస్తే మడమ తిప్పని నైజం మన తెలుగుదేశం పార్టీది. సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో, పాలనలో వెనుకబడిన వర్గాలకు అగ్రతాంబూలం ఇస్తూ, వడ్డెర కులానికి సముచిత గౌరవం కల్పించిన ప్రజా నాయకులకు వడ్డెర సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది" అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా ఎంపికైన శ్రీమతి దళవాయి రమాదేవి ఈ సందర్భంగా వారు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. వడ్డెర సామాజిక వర్గానికి గుర్తింపునిచ్చి శాసనమండలిలో స్థానం కల్పించడం ద్వారా నిజమైన సామాజిక న్యాయం నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు.

# దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండండి



**నంది పత్రిక ఆత్మకూరు..** ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మరియు జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు కొట్టాల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వడ్ల రామాపురం గ్రామంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటి లక్షణాలు, దోమల నిర్మూలన గురించి ఆరోగ్య కార్యకర్త బి. విశ్వనాథ్ వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలలో దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి ప్రజలలో అవగాహన కల్పించడం ద్వారా మాత్రమే 2030 కి దేశంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నిర్మూలన జరుగుతుందని సూచించారు. కావున ప్రజలు తమ ఇంటి పరిసరాలలో, తమ ఇంట్లో దోమల ఆవాసాలను గుర్తించి నాశనం చేయడం ద్వారా దోమల నిర్మూలన జరిగి వాటి ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టవచ్చని తద్వారా ఆరోగ్యాంధ్రప్రదేశ్ ను నిర్మాణం చేయడం సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాలు మరియు ప్రజలు కీలకంగా వ్యవహరించి తమ వంతు కర్తవ్యంగా దోమల నివారణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు బేరి విశ్వనాథ్, కల్పలత, ఆశా కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ఏ కోడూరులో పొలం పిలుస్తోంది

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 19** బండి ఆత్మకూరు మండల పరిధిలోని అయ్యవారి కోడూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ బుధవారం "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. సాళ్ల వరి సాగు చేసిన రైతు దస్తగిరి పొలాన్ని సందర్శించి, ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో పంటను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.అదేవిధంగా ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని, విత్తనం విత్తుతున్న సమయంలో విత్తన శుద్ధి చేసుకోవాలని వాటి విధానం, దాని ప్రాధాన్యతను వివరించారు. నాణ్యమైన విత్తనంతో పాటు సరైన విత్తన శుద్ధి చేయడం ద్వారా పంటలో తెగుళ్లను నియంత్రించి మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

**ఫార్మర్ ఐడి కచ్చితంగా చేసుకోవాలి :** కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి కొరకు వ్యవసాయ భూమి కలిగిన రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వారితో పాటు కౌలు రైతులు కూడా ఫార్మర్ ఐడి పొందాలని ఏఓ తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కొరకు సంబంధిత రైతు సేవ కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలని వారు తెలిపారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు నీటి వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏఓ సూచించారు. సాళ్లు మార్చి సాళ్లలో తడులు ఇవ్వడం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మయ్య, రియాజ్ గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాసరెడ్డి రైతులు పాల్గొన్నారు.



# జయహో బిసి నినాదం కాదు టిడిపి విధానం

## కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ

**కర్నూల్ సిటీ నంది పత్రిక** మంగళవారం తేదీ 18 .8.2026 రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికలలో వెనుకబడిన వర్గాల వారికి 34 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రకటించడం హర్షించదగ్గ పరిణామం అని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ తెలియజేశారు బుధవారం వారు కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్ డిసిఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కె నాగేంద్ర జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీల అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు మరియు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కైపా పద్మలత రెడ్డి,డి జేమ్స్ తో పాటు వివిధ కార్పొరేషన్ లడైరెక్టర్లు ముఖ్య నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన పత్రిక మరియు మీడియా ప్రతినిధులసమావేశంలో వారు మాట్లాడారు. ఆ తర్వాత స్థానిక విశ్వేశ్వర సర్కిల్ నందు స్వీట్స్ పంచడం, నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలా అభిషేకం చేయడం జరిగినది .ఈ సందర్భంగా పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ మాట్లాడుతూ కీర్తిశేషులు నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించకపోయి ఉంటే ఈరోజు బీసీలు ఈ స్థాయిలో ఉండే వారు కాదని మొట్టమొదటిసారి గా ఎన్టీరామారావు బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి వారిని రాజ్యాధికారంలో భాగస్వామ్యాన్ని చేసిన ఘనత ఒక్క ఎన్టీఆర్ కి దక్కిందని తరువాత నారా చంద్రబాబు నాయుడు బీసీలకున్న రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేశారని తెలుగుదేశం పార్టీ అంటే బీసీల పార్టీ అని బీసీలు అంటే తెలుగుదేశం అని చాటి చెప్పుకునేలా బీసీల కోసం పాటుపడిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైయస్ జగన్మోహన్ రెడ్డి బీసీలపై కక్షగట్టి బీసీలకు ఉన్నటువంటి 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి 2021లో 16,800 మంది బిసి సామాజిక వర్గాల వారినీ స్థానిక సంస్థలలో పదవులు పొందకుండా దూరం చేశారని వారు చేసిందల్లా కేవలం బీసీలను ఓటర్లుగా మాత్రమే




చూశారు తప్ప బీసీలకు చేసింది శూన్యమని బీసీలను హత్యలు చేయడంలో గొడ్డలి పార్టీ వారిదే పైచేయని తెలియజేశారు. 2024 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 34శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు ప్రకటించడం జరిగింది అని , ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు అలాగే దేశ ప్రధాని మోడీ రాష్ట్ర అభివృద్ధికి సహకరించడం కాక అన్ని విధాల తోడ్పాటు

నందిస్తున్నందుకు వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందకపోయినా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తానని చంద్రబాబు నాయుడు ప్రకటించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ రిజర్వేషన్ల ప్రక్రియలో సహకరించినటువంటి తెలుగుదేశం బిజెపి జనసేన పార్టీల నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు, ఇటీవల రాష్ట్ర శాసనమండలికి ఒక బీసీ వడ్డెర సామాజిక వర్గమునకు చెందిన రమాదేవి కి,

ఎస్ సి సామాజిక వర్గమునకు చెందిన తెలుగుదేశం పార్టీ పాలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య కి అవకాశం కల్పించి తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాలకు ఎప్పుడు అండగా ఉంటుందని పార్టీకి అంకితభావంతో పనిచేసిన వారికి న్యాయం చేకూర్చుతుందని వీరి నియామకంతో రుజువైందని తెలిపారు విక్రమ్ సింగ్, నాగేశ్వరరావు యాదవ్ కె నాగేంద్ర, సత్రం రామకృష్ణుడు, విజయకుమారు,పద్మలతారెడ్డి కె లక్ష్మీనారాయణ ఎల్వి ప్రసాద్ వెంకట్ రాముడు ఎల్లప్ప, మాట్లాడుతూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తెలుగుదేశం పార్టీ తప్ప బీసీలకు ఏ పార్టీ కూడా న్యాయం చేయలేదని ఒక్క తెలుగుదేశం పార్టీని బీసీలకు అత్యున్నత పదవులను ఇవ్వడం జరిగిందని పార్టీకి ఎల్లవేళలా ఎలాంటి ఉండేది బీసీలను అయితే ఓటు బ్యాంకుగా మార్చుకొని బీసీలను అనగ దొక్కిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రాబోయే రోజులలో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు ముఖ్యంగా బి సి ఎస్ సి మైనార్టీ వర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమం నకు పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు జై జగదీష్ అధ్యక్షు లు దాశెట్టి శీను, పోతురాజు రవికుమార్, నరసింహులు హనుమంతరావు చౌదరి కుంపటి కృష్ణుడూ మద్దిలేటి, మరియు వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

# నూతన దంపతులకు ఎమ్మెల్యే దాసరి సుధా శుభాకాంక్షలు

**కలసపాడు, ఆగస్టు 19 (నంది పత్రిక):** బద్వేల్ నియోజకవర్గం కలసపాడు మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన కర్నాటి మదిరెడ్డి రెడ్డి, తులసమ్మ దంపతుల జ్యేష్ఠ కుమారుడు మహేంద్ర రెడ్డి, అశ్విని



వివాహ వేడుకలో బద్వేల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే దాసరి సుధా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం అధ్యక్షుడు దేవసాని ఆదిత్యనాథ్ రెడ్డి, జెడ్పీటీసీ ముప్పిరెడ్డి, మండల ఎంపీపీ నారాయణ, మాజీ జెడ్పీటీసీ సుదర్శన్, తెల్లపాడు మాజీ సర్పంచ్ రమణారెడ్డి, ఎంపీటీసీ నారాయణరెడ్డి, సర్పంచ్ జయన్నతో పాటు గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# డైట్ విభాగాన్ని పరిశీలించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా కె. వెంకటేశ్వర్లు

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు ఆసుపత్రిలోని డైట్ విభాగాన్ని పరిశీలించారు. గతంలో డైట్ విభాగంలో చేపట్టిన పనులు పూర్తికావడంతో వాటి పురోగతిని ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం డైట్ భోజనం నాణ్యతను పరిశీలించి ఆసుపత్రిలోని రోగులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూపరింటెండెంట్ డైట్ సిబ్బందికి ఆదేశించారు.డైట్‌లో భోజనం చేసే విషయంలో కేవలం డ్యూటీ లో ఉన్న వైద్యులు మాత్రమే భోజనం చేసే విధంగా టోకెన్ సిస్టమ్ ను ఏర్పాటు చేయాలని డైట్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ తో పాటు ఆసుపత్రి అధికారులు పాల్గొన్నారు.



# దేశాన్ని నిరుద్యోగ దేశంగా మారుస్తున్న పాలకులలో మార్పు రావాలి




## మోడీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ?

## ఉద్యోగ అవకాశాలు కల్పించకుంటే పాలకులను రాజకీయ నిరుద్యోగులుగా మారుస్తాం ఏ ఐ వై ఎఫ్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** దేశాన్ని నిరుద్యోగుల దేశంగా మారుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం కర్నూల్ కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు మాట్లాడుతూ సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు మార్పు కావాలి, మార్పు రావాలి అని నినాదంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ దేశాన్ని నిరుద్యోగదేశంగా మారుస్తున్నారని ఇలాంటి విధానాల నుండి మార్పు రావాలని ఏఐవైఎఫ్ గా కోరుకుంటున్నామని ఆయన తెలిపారు నరేంద్ర మోడీ తాను అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి 12 సంవత్సరాల పూర్తి అయిన ఉద్యోగాలు కల్పించకపోగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, ఓడరేవులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తో ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు బిజెపి ప్రభుత్వంలో భాగస్వామ్యైన కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇవ్వడమే కాకుండా రాష్ట్రంలో సంపద సృష్టించి 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, అలా కాని పక్షంలో ప్రతి నిరుద్యోగికి నెలకు 3000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి అయిన ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగ భృతి ఆలోచించకపోవడం సిగ్గుచేటు అన్నారు రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ శాఖలో 11639 పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటికి నోటిఫికేషన్ ఇవ్వడం లేదన్నారు 17వ తేదీ నుండి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డీఎస్సీ నోటిఫికేషన్ అని మాయమాటలు చెబుతున్నారు అని మీరు అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు అయింది కదా ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో స్పష్టంగా నిరుద్యోగ యువతకు చెప్పాలని అలా కాకుండా మాయ మాటలతో నిరుద్యోగులను మోసం చేయాలని చూస్తే నిరుద్యోగులు మీ ప్రభుత్వానికి చివరి గీతం పాడుతారని ఆయన హెచ్చరించారు నిరుద్యోగులకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దు నిద్ర వీడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోతే సెప్టెంబర్ 1వ తేదీన చలో ఢిల్లీ నిర్వహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో హామీ తుమి తేల్చుకుంటామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సహాయ కార్యదర్శి బీసన్న, రాజీవ్, రాజు లు మాట్లాడుతూ ఒకప్పటి ఆంధ్ర రాష్ట్ర రాజధాని కర్నూలు జిల్లా నేడు అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉందని ప్రభుత్వ లెక్కలు చెప్తా ఉన్న కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు మండలాన్ని గతంలో పారిశ్రామిక కారిడార్, ఇప్పుడు పారిశ్రామిక హబ్బు అని ముద్దు ముద్దు పేర్లతో పిలుస్తున్నారు తప్ప స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కర్నూలు జిల్లా నుండి పారిశ్రామిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ ఓర్వకల్లులో ఏర్పాటైన పరిశ్రమలలో స్థానిక యువతకు ఎందుకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోతున్నారని వారు ప్రశ్నించారు, ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ స్థానిక యువతకే 70% ఉద్యోగాలు కల్పించే విధంగా మంత్రి మరియు జిల్లా ప్రజా ప్రతినిధులు, అసెంబ్లీలో గళం విప్పి మాట్లాడే జీవో సాధించాలని వారు డిమాండ్ చేశారు అలా చేయని పక్షంలో జిల్లా యువతకు మీరు మోసం చేసిన వారు అవుతారని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యులు పెద్దయ్య, అంజిత్, రాజు, సిద్దు, ఉపేంద్ర, రవి, చిన్న తారక్, నగర నాయకులు చంటి, శ్రీకాంతు, అఖిల్, కాసిం, హుస్సేన్, రవి ,వీరయ్య, భద్ర కుమార్, ప్రభాకర్, రవితేజ, సురేంద్ర యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో ముద్దాయి అరెస్టు

## కత్తి స్వాధీనం

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, కర్నూలు డీఎస్పీ కె .వి . రాఘవేంద్ర ఆధ్వర్యంలో హత్యాయత్నం కేసులో ముద్దాయి ఫయాజ్ బాష ఫయాజ్ (29 సం.), తండ్రి: అమీన్ బాష, ఇంటి నెం. 36-46-110, చిత్తారి వీధి, కర్నూలు టౌన్‌ను అరెస్టు చేశారు. కర్నూలు 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిత్తారి వీధిలో ఫిర్యాదుదారుడి ఇంటి వద్ద 17.08.2026 అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఫయాజ్ బాష, షేక్ షఫీపై చంపాలనే ఉద్దేశంతో కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో షేక్ షఫీ తలకు బలమైన రక్తగాయం, చేతికి రక్తగాయాలు అయ్యాయి. షేక్ ముంతాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో జతీ.చీశీ.83/2026 ఖ/o 109(1), 79, 351(2) బి యస్ యస్ కింద 17.08.2026న కేసు నమోదు చేశారు.ముద్దాయి కోసం కర్నూలు 1 టౌన్ సీఐ జి. మారుతి శంకర్, ఎస్ఐ పి. మహమ్మద్ అలీ ఖాన్ మరియు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.రాబడిన సమాచారం మేరకు 18.08.2026 సాయంత్రం 6 గంటల సమయంలో కర్నూలు టౌన్ పరిధిలోని కల్లూరు దర్వాజా హంద్రీ బ్రిడ్జి వద్ద ముద్దాయి ఫయాజ్ బాష ఫయాజ్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నేరానికి ఉపయోగించిన ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. కేసును సత్వరం ఛేదించిన కర్నూలు డీఎస్పీ కె .వి . రాఘవేంద్ర, కర్నూలు 1 టౌన్ సీఐ జి. మారుతి శంకర్, ఎస్ఐ పి. మహమ్మద్ అలీ ఖాన్ మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ అభినందించారు.



# ఆలయప్రాంగణములోని వీరభద్రస్వామికి విశేష పూజలు

**శ్రీశైలం ఆగస్టు 19(నంది పత్రిక)** లోకకల్యాణం కోసం దేవస్థానం ( 19.08.2026) సాయంకాలం ఆలయ ప్రాంగణం లోని వీరభద్రస్వామివారికి (జ్వాలా వీరభద్రస్వామివారికి) విశేషపూజలను నిర్వహిస్తోంది. ఆలయప్రాంగణంలో మల్లికార్జునస్వామివారి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామికి అఘోరవీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామివారికి ప్రక్కనే దక్షప్రజాపతి కనిపిస్తాడు. ఈ స్వామిని పరివార ఆలయాలలో భాగంగా ప్రతినిత్యం పూజించడం జరుగుతోంది. కాగా ప్రతి బుధవారం ప్రదోషకాలంలో విశేషఅభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ పూజవలన లోకశాంతి, దుర్భిక్షనివారణ, భక్తుల అనుకున్న కోరికలు నెరవేరుతాయి. ముఖ్యంగా క్షేత్ర అభివృద్ధి జరుగుతుంది. కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజను నిర్వహించబడుతుంది. తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, పలురకాల ఫలోదకాలతోనూ, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించడం జరుగుతుంది. ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడుతుంది.



# రైతులకు ఇవ్వాల్సిన విత్తనాలను బ్లాక్ మార్కెట్లో కి తరలిస్తున్నారు

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి కే జగన్నాథం

**కర్నూల్ సిటీ నంది పత్రిక**సిఆర్ భవన్ లో జరిగిన ప్రెస్ మీట్ లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం మాట్లాడుతూ జిల్లాలోని విశిష్ట వేరుశనగ రకమ్ పక్కదారి పట్టి వ్యవసాయ అధికారులు రైతులకు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటున్నారు. 100% సబ్సిడీ పేరుతో కేంద్ర




ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన వేరుశనగను ఉమ్మడి కర్నూలు నంద్యాల జిల్లాలలో 29 మండలాలు ఈ పథకం అమలు కావాలి కానీ కర్నూలు జిల్లాల్లో 3000 వేరుశనగ నంద్యాల జిల్లాలో 1000 కింటాలు వేరుశనగ పంపిణీ చేయాల్సి ఉంది కేవలం 10 శాతమే పంపించేసి మిగతా వాటిని పక్కదారి పట్టించి మూడు కోట్ల విలువైన వేరుశనంగా రైతులకు ఉచితంగా పంపిణీ చేయకుండా బయట అమ్ముకున్నారు. నాలుగు వేల క్వింటాలకు తరలించారు నామమాత్రగా పంపిణీ చేసినట్లు పేపర్లు ప్రకటన ఇచ్చేందుకు ఫోటోలు దిగారు కావున ఈ సమస్యపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి సబ్సిడీ వేరుశనగా విత్తనాలు డిక్రీస్ యాప్ ద్వారా రైతులకు పంపించాల్సి ఉంది. అధికారులు మాత్రము తమకు కావాల్సిన రైతుల పేర్లు నమోదు చేసి పక్కదారి పట్టింది కోట్ల రూపాయలు దండుకుంటున్నారు ఈ సమస్యపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాం అని ఆయన అన్నారు ఈ కుంభకోణంలో వ్యవసాయ శాఖలో ఉన్న జిల్లా అధికారుల పాత్ర ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి టెక్నికల్ వ్యవసాయ అధికారుల పాత్ర కూడా ఇందులో ఉంది జిల్లా ఆధికారులు బినామీ పేర్లతో ఈ వ్యవహారమ్ నడిపి వేరుశనగ జిల్లాలకు రాకుండా బయట అమ్ముకున్నారు జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో ఇంత పెద్ద కుంభకోణం జరుగుతున్న ఎవరు పట్టించుకోవడం లేదంటే ఈ వ్యవహారం అంతా కూడా అధికారులకు తెలిసే జరిగింది. అనుమతి లేనిదే ఆశీస్సులు లేనిదే క్రింది అధికారులు ఇంత అవినీతికి పాల్పడరు సబ్సిడీలు కూడా దొంగచాటుగా కాజేసు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవాలి కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం సహాయ పడడానికి సబ్సిడీలు ఇస్తే వాటిని రాష్ట్ర కూటమి ప్రభుత్వం అధికారుల ద్వారా లోపాయకారిగా గుట్టు చప్పుడు కాకుండా మూడు వేల క్వింటాలు వేరుశనగ విత్తనాలు నొక్కేశారు ఇలా ఒక జిల్లాలోనే ఉంటే మిగతా జిల్లాలో ఎలా ఉంటుందో పరిస్థితి అని ఆయన ఆవేద వ్యక్తం చేశారు. కావున తక్షణమే దీనిపై ఐఏఎస్ అధికారులతో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని జిల్లా అధికారుల పాత్ర ఉంటే వారిని వెంటనే సెక్షన్ చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు లేనిపక్షంలో రైతులను కూడగట్టి భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ ప్రెస్ మీట్ లో కర్నూలు జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే నాగేంద్రయ్య, కల్లూరు మండల కార్యదర్శి బి బి రాముడు.

# విధుల పట్ల అలసత్వం వహిస్తే ఇంటికే..


## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

## 2వ శానిటేషన్ డివిజన్ డ్రైవర్‌పై చర్యలు

## క్రమశిక్షణ, బాధ్యత లేకుంటే సేవలు అనవసరం

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**కర్నూల్ సిటీ నంది పత్రిక** విధుల పట్ల అలసత్వం, క్రమశిక్షణారాహిత్యం, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారి సేవలు నగరపాలక సంస్థకు అవసరం లేదని కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. బుధవారం పాతబస్తీ, జొహరాపురం, ఏ.క్యాంపు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చిత్తారివీధిలో దోమల నివారణకు లార్వీసైడ్ మందు పిచికారీని పరిశీలించి, మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఇటీవల సీజ్ చేసిన చిన్న, పెద్ద కబేళాలను పరిశీలించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, భోజన నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. 6వ వార్డు చిన్న కబేళా వద్ద చెత్తతో కూడిన ట్రాక్టర్‌ను రహదారిపైనే నిలిపి ఉంచడంతో పాటు, మరో ట్రాక్టర్‌తో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తుండటంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను వివరాలు అడగ్గా, డ్రైవర్ రాము విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, దీంతో చాలా కాలంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే వ్రాతపూర్వక నివేదిక అందజేయాలని, డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని కమిషనర్ స్పష్టం చేశారు. ఆప్కాస్ కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తొలగింపు, రెగ్యులర్ సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధి సమయంలో అనవసరంగా గుంపులుగా చేరి ముచ్చట్లు పెట్టడం, అనుమతి లేకుండా సెలవులకు వెళ్లడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగి తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించి, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆర్.రాజు, శివశంకర్ తదితరులు ఉన్నారు.



# దాల్మియా ప్రభావిత గ్రామస్తుల పరిహారం, పునరావాసం, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి..!



## కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంస్థ యాజమాన్యం, రెవెన్యూ అధికారులతో సమావేశం

**కడప బ్యూరో చీఫ్, ఆగస్టు 19 నంది పత్రిక** : దాల్మియా పరిశ్రమ ప్రభావిత గ్రామాల ప్రజలకు ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నిబంధనల మేరకు అమలు చేసి, వారికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను, దాల్మియా సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనాతో కలిసి దాల్మియా సంస్థ యాజమాన్య ప్రతినిధులు, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గత ఏడాది నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇచ్చిన హామీలు, తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని అంశాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బాధిత ప్రజలకు అందాల్సిన పరిహారం, పునరావాస చర్యలు, అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఇటీవల జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమర్లలోని దాల్మియా సిమెంట్ పరిశ్రమను సందర్శించిన అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, యువ నాయకుడు భూపేష్ రెడ్డితో కలిసి సమీపంలోని దుగ్గనపల్లె ఆలయం వద్ద ప్రభావిత గ్రామాల ప్రజలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలను వివరించడంతో, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. దుగ్గనపల్లి గ్రామ పునరావాసానికి ఇప్పటికే స్థల పరిశీలన పూర్తయిందని ఆర్డీవో శిరీష తెలిపారు. చిన్నకొమెర్ల గ్రామంలో సుమారు 10 ఎకరాల స్థలాన్ని గుర్తించి, 60 కుటుంబాలకు వసతి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు అందించిన విధానంలోనే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం అందించేందుకు అంగీకారం కుదిరిందని తెలిపారు. పునరావాస ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమ కాంపౌండ్ వాల్ కారణంగా వర్షాలు, వరదల సమయంలో సహజ నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడి వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయన్న ఫిర్యాదులపై కూడా సమీక్షించారు. సమస్య పరిష్కారానికి వంకను విస్తరించాలని నిర్ణయించి, అంచనా వ్యయాన్ని సిద్ధం చేసి పనులను సాగునీటి శాఖకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. పరిశ్రమల నుంచి వెలువడే దుమ్ముతో పంటలు దెబ్బతింటున్న నేపథ్యంలో ప్రభావిత రైతులకు రాబోయే పంట కాలానికి ఎకరాకు రూ.10 వేల ఇన్‌పుట్ సబ్సిడీ అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అవసరాన్ని బట్టి విత్తనాలు, ఎరువుల




రూపంలో కూడా సహాయం అందించేలా ప్రక్రియ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. నవాబ్‌పేట ప్రాంతంలో మైనింగ్, బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లు దెబ్బతింటున్నాయన్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలనతో సమగ్ర సర్వే నిర్వహించి నష్టాన్ని అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల పురోగతిపైనా సమీక్షించారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. పునరావాసం, పరిహారం, వంక విస్తరణ, పంట నష్టానికి సహాయం, దెబ్బతిన్న ఇళ్ల సర్వే తదితర చర్యలను వేగవంతం చేసి ప్రభావిత గ్రామాల ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు ఆర్డీవో శిరీష, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సుధ, హౌసింగ్ పీడి రాజారత్నం, రెవెన్యూ అధికారులు, దాల్మియా సంస్థ యాజమాన్య ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు..

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 19: నంది పత్రిక** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలో అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాకు వివరించారు. చేపట్టాలన్నారబుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సంబంధిత పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖల కమిషనర్లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీపీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కడప కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పాల్గొనగా.. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుంచి డీఆర్వో కె. మల్లికార్జునుడు, జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డీపీవో రామచంద్ర, కేఎంసీ కమిషనర్ భవానీప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్.. అన్ని జిల్లాల కలెక్టర్ లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో అన్ని రకాల ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. ఈ



సందర్భంగా జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. ఓటర్ల జాబితాల పరిశీలన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల సిబ్బంది సమీకరణ, శిక్షణ, ఎన్నికల సామగ్రి తదితర అంశాలపై అధికారులు చేపడుతున్న చర్యలను వివరించారు. గతంలో గ్రామ పంచాయతీ, జెడ్పిటిసి, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికలను కూడా పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని 39 మండలాల పరిధిలో 619 గ్రామపంచాయతీలు, 6,004 వార్డులు ఉన్నాయని, మొత్తం 11,84,815 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికలు నిర్వహించని 8 గ్రామపంచాయతీలకు సంబంధించి న్యాయస్థానాల ఉత్తర్వులు, ఎన్నికల బహిష్కరణ తదితర అంశాలను కూడా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ క్షేత్రస్థాయిలో కొనసాగుతోందని, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ఆగస్టు 23న, తుది జాబితాను ఆగస్టు 31న ప్రచురించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం నిర్వహిస్తున్నామని, ఇంటింటి సర్వే ఆగస్టు 18 నుంచి 22 వరకు, ఓటర్ల గుర్తింపు, ముసాయిదా జాబితా ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, విచారణ అనంతరం గ్రామసభల ద్వారా జాబితాల ధ్రువీకరణ చేపట్టి సెప్టెంబర్ 7న తుది జాబితాలను ప్రచురించేలా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పత్రాల ముద్రణకు కావాల్సిన కాగితం, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై కూడా ముందస్తు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఆళ్లగడ్డ వైపిపిఎం కళాశాలను మోడల్ ప్రాజెక్టుగా తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పించాలి

## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

## ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

## సానుకూలంగా స్పందించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 19 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలో ఉన్న వైపిపిఎం పాఠశాల, జూనియర్ , ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ను మోడల్ ప్రాజెక్టుగా తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థుల నుంచి మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే అఖిల ప్రియ మంత్రి లోకేష్ కు విజ్ఞప్తి చేశారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొని ఉన్న సమస్యలపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1000 మంది కి పైగా విద్యార్థులు చదువుతున్న ఈ కళాశాల ప్రాంగణంలో గత ప్రభుత్వంలో విద్యార్థులకు సరైన తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని కూడా డిగ్రీ కాలేజీ అక్కడే మంజూరు చేయించి అక్కడే విద్యార్థులను బోధన చేయించడం జరిగిందన్నారు. తరగతి గదుల కొరత, టాయిలెట్ , ల్యాబ్ లు, నీటి సమస్య ఉందన్నారు. గతంలో కాంపౌండ్ కూడా ఉండేదని గత ప్రభుత్వంలో అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ఆ స్కూల్లో మీటింగ్ పెట్టడంతో సెక్యూరిటీ కి సంబంధించిన వాహనాలు లోపలికి వచ్చేందుకు ఇబ్బందులు అని చెప్పి కాంపౌండ్ వాల్ కూల్చివేశారన్నారు. సమావేశశీ అనంతరం కాంపౌండ్ వాల్ మంజూరు కూడా చేయిశీచలేకపోయారని ఆమె సభ దృష్టికి తీసుకొని వచ్చారు. అదేవిధంగా కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, బెంచులు, చైర్లు, కిట్లు, స్మార్ట్ బోర్డులు, టేబుల్స్ కూడా అవసరం ఉందని ప్రిన్సిపల్ తెలియజేయడం జరిగిందన్నారు. డిగ్రీ కళాశాల నిర్మాణం కోసం తహసిల్దార్ 2.5 ఎకరాల ప్రభుత్వ స్థలశీ ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. డిగ్రీ కళాశాలలో టీచింగ్ 9, నాన్ టీచింగ్ 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గత రెండు సంవత్సరాలుగా "ఆస్క్ అఖిల" అనే కార్యక్రమం ద్వారా యువతతో ఇంట్రాక్ట్ అవుతున్నామన్నారు. ఉద్యోగ అవకాశాలు ఈ ప్రాంతానికి కొన్ని కంపెనీలు తీసుకొని వచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తమ దృష్టికి విద్యార్థులు తీసుకొని వచ్చారన్నారు. ఇప్పటికే తాము 823 మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈరోజు



గ్యాలరీలో కూర్చొని మేం మాట్లాడింది, లోకేష్ అన్న మాట్లాడింది చూస్తున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వేసిన ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ సమాధానం ఇస్తూ రాష్ట్రంలో 37 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు కల్పించే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. ఆళ్లగడ్డ డిగ్రీ కాలేజీకి నూతన భవనాన్ని నిర్మిస్తామన్నారు. ప్రతి కళాశాలకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు 15 కోట్లు ఖర్చు అవుతుందని దశల వారిగా నిధులు సమకూరుస్తున్నామని పేర్కొన్నారు. ఆళ్లగడ్డలో కళాశాల కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని సాస్కి స్కీమ్ కింద పూర్తి చేస్తామని అవసరమైన టీచింగ్ , నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కళాశాలకు కావలసిన ల్యాబ్స్ కంప్యూటర్లను జూ4 విధానంలో సమకూర్చుకోవాలని ఎమ్మెల్యేకు సూచించారు.

# ఎంపీడీవో బాధ్యతారాహిత్యం అభాసుపాలైన విచారణ



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 19:** బండి ఆత్మకూరు ఎంపీడీవో గాయత్రి బాధ్యత రాహిత్యంగా వ్యవహరించడంతో విచారణ కాస్త అభాసు పాలయింది. దీంతో విచారణకు వచ్చిన బాధితులు విచార వదనంతో వెను తిరగాల్సి వచ్చింది. మండల పరిధిలో ఉన్న ఏ కోడూరు గ్రామంలో ముస్లింల స్మశాన స్థలానికి సంబంధించి కొద్ది నెలల క్రితమే అధికారులకు పరిష్కార వేదికలో ఫిర్యాదు అందింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఓ డివిజన్ స్థాయి అధికారి వస్తున్నారని, ఇందుకు సిద్ధమై ఉండాలని ఏ కోడూరు మైనారిటీలను ఎంపీడీవో ఉప్పందించారు. ఈ సమాచారంతో మైనార్టీ సోదరులు మహిళలు ఏ కోడూరులో పెద్ద ఎత్తున గుమి గూడారు. అయితే బుధవారం బండి ఆత్మకూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఆత్మకూరు డిఎల్డిఓ, అన్వరా బేగం తాను ఏ కోడూరు గ్రామానికి విచారణ నిమిత్తమై రావడంలేదని ఇందుకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారుల నుండి ఎలాంటి ఆదేశాలు తనకు రాలేదని పేర్కొన్నారు. మరి ఇలాంటి పరిస్థితులలో ఏ కోడూరు మైనార్టీ ప్రజలను ఎంపీడీవో గాయత్రి డివిజన్ స్థాయి అధికారి విచారణకు వస్తున్నట్లుగా ఎందుకు తమకు సమాచారం అందించారని ప్రశ్నిస్తున్నారు. ఏదో జరుగుతుందని ఊహించుకొని విచారణ పేరుతో ప్రజలను ఒకే చోటికి రప్పించడంలో మండల స్థాయి అధికారైన ఎంపీడీవో ప్రవర్తనపై ప్రజలు చర్చించుకుంటున్నారు. డివిజన్ స్థాయి అధికారి వస్తున్నారని, తమకు ఎంపీడీవో సమాచారం అందించిన కారణంగానే తామందరము ఇక్కడికి రావాల్సి వచ్చిందని ముస్లింలు పేర్కొంటున్నారు. ఏ కోడూరు వద్ద ప్రజలు పెద్ద ఎత్తున తిష్ట వేయడంతో, గ్రామంలో ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం జిల్లా పోలీసు అధికారుల దృష్టికి వెళ్లడంతో, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ జగన్మోహన్ పోలీస్ సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. ఈ విషయంపై ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని, గ్రామంలో అధికారులు పర్యటించరాదని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ బండి ఆత్మకూర్ తహసిల్దారు పద్మావతమ్మకు చరవాణి ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంపై ఎలాంటి విచారణ చేపట్టకుండా వెను తిరగాలని తాసిల్దార్ పద్మావతమ్మ అక్కడికి వెళ్లిన సిబ్బందిని ఆదేశించారు. సంఘటనతో సంబంధంలేని విషయంలో ఎంపీడీవో గాయత్రి తల దూర్చిన వ్యవహారంపై ఉన్న తాధికారులు చర్యలు తీసుకోవాలని మైనార్టీలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# శక్తి యాప్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి డి.ఎస్.పి శ్రీనివాసరావు



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 19 నంది పత్రిక** శక్తి యాప్ ను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ డి.ఎస్.పి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ప్రజ్ఞా డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన విద్యార్థినుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైనా ఈవ్ టీజింగ్ లాంటి ఘటనలు చోటు చేసుకుంటే అమ్మాయిలు వెంటనే శక్తి అప్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఐదు పది నిమిషాలు వ్యవధిలోనే స్పందించి వారికి తగిన న్యాయం చేస్తారని డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో టౌన్ సిఐ నాగరాజరావ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

# అహోబిలంలో స్వాతి నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం





**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 19 నంది పత్రిక**ఆళ్లగడ్డ మండలంలోనిప్రముఖ పుణ్య క్షేత్రమైన అహోబిలంలో బుధవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. ఎగువ దిగువ అహోబిలం క్షేత్రాలలో పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిగువ అహోబిలంలో ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో సుదర్శన హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. శ్రీ ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి,భూదేవి అమ్మవార్లకు అభిషేకం విశేష పూజలు నిర్వహించి స్వర్ణ దివ్య ఆభరణాలతో అలంకరించారు. పూజలలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# స్థానిక సంస్థలు ఎన్నికలు అత్యంత పారదర్శకంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలి

### ఎన్నికల కమిషన్ అనిల్ చంద్ర పునీత

**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 19 నంది పత్రిక** స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవా లని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అనిల్ చంద్రపునీత, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.బుధవారం అమరావతి, సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లు,జిల్లా పంచాయతీ అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పశ్చిమ గోదావరి జిల్లాలో స్థానిక ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు వివరిస్తూ జిల్లాలో మొత్తం 5 పురపాలక సంఘాలు, ఒక నగర పంచాయతీ, 409 గ్రామ పంచాయతీలో స్థానిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని అన్నారు. వీటిలో 16 గ్రామాలకు సంబంధించి కోర్టు కేసులు పరిష్కా రానికి పెండింగ్లో ఉన్నాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత పారద ర్శకంగా, ప్రణాళిక బద్ధంగా నిర్వహించ డానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులు, మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియ వేగవంతం చేయడం జరుగు తుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితా ఇప్పటికే ఖరారు చేయటం జరిగింద ని. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు, ఓటింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేయటం జరుగు తుందని అన్నారు. సామాజిక వర్గాల ఓటర్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాలకు సంబంధించిన ఎలక్ట్రోరల్ రోల్స్ సిద్ధం చేసే ప్రక్రియ పూర్తయిందని అన్నారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ప్రతి ఆదేశాన్ని కచ్చితంగా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 20 మండలాల్లో 409 పంచాయతీలలో రెండు విడతల్లో పోలింగ్ నిర్వహణకు అనుగుణంగా ప్రతిపాదనలు పంపడం జరిగింద న్నారు. మొదటి విడతలో నరసాపు రం డివిజన్లో 8 మండలాలలోని 165 పంచాయ తీలు. తాడేపల్లి గూడెం డివిజన్లోని ఇరగవరం అత్తిలి రెండు మండలాల్లో ని 39 గ్రామ పంచాయతీలు ఉన్నాయని అన్నారు. రెండవ విడత లో భీమవరం డివిజన్ 7 మండలాలలో 143 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. తాడేపల్లిగూడెం డివిజన్ లో పెంటపాడు, తణుకు తాడేపల్లిగూడెం మూడు మండలాల లో 62 గ్రామ పంచాయతీలు ఉన్నాయని అన్నారు. జిల్లాలో మొత్తం 4వేల579 పోలింగ్ కేంద్రాలను గుర్తించగా వీటిలో సుమారు 3వేల366 పోలింగ్ కేంద్రాలను ఆన్లైన్లో మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగు తుందని అన్నారు. ఓటర్ల జాబితాలోని ఎస్సీ, ఎస్టీ, బిసి ఇతర వర్గాల ఓటర్ల గుర్తింపు అధికారి కంగా నియ మించాలని దీనికి సంబంధించి షెడ్యూల్ విడుదల చేయటం జరిగిందని అన్నారు. అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ఖరారు చేసిందని అన్నారు. పోలింగ్ కేంద్రాల ముసాయి దా జాబితా తయారీ ఆగస్టు 21వ తేదీ, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణకు 23వ తేదీ, వినతులు, అభ్యంతరాల స్వీకరణకు ఆగస్టు 26 తేదీ, కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ద్వారా పోలింగ్ కేంద్రాల జాబితా ఆమోదానికి 29వ తేదీ, పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురణకు ఆగస్టు 31వ తేదీ గా షెడ్యూల్లో పేర్కొనడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపుకు జిల్లా పంచాయతీ అధికారి నియ మించిన కార్యదర్శు లు, మినిస్టీరియల్ సిబ్బంది ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితా ప్రచురణ సరిగ్గా జరిగేలా చూడాలని అన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 18 వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఓటర్ల ఇంటింటి సర్వే, 23వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఓటర్ల గుర్తింపు, 25వ తేదీన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ, 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు అభ్యర్థుల అభ్యంత రాలు దాఖలు చేయడానికి సమయం, 29వ తేదీ నుంచి సెప్టెంబర్ రెండవ తేదీ వరకు అభ్యంతరాల పై విచారణ, ముగింపు ఎస్సీ ఎస్టీ బీసీ మార్కింగ్ తో ముసాయిదా ఓటర్ల జాబితా రూపకల్పన, మూడవ తేదీ నుంచి ఆరవ తేదీ వరకు గ్రామ సభలో జాబితాల ధ్రువీకరణ, సెప్టెంబర్ ఏడవ తేదీన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల మార్కింగ్ తో ఉన్న తుది జాబితా తయారు చేయడం, ప్రచురించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారమే ఎన్నికలు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో వివిధ జిల్లాల కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారి అనూరాధ, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# యువ పారిశ్రామికవేత్తలు నూతన ఆలోచనలతో పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి






### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్, ఆగస్టు 19, నంది పత్రిక** జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని, కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన ఆలోచనలతో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. భీమవరంలోని ఎస్.ఆర్.కె. ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న లివెండర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లో బుధవారం జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన అవకాశాలు, వనరులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. పారిశ్రామికవేత్తలు కాలానుగుణంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవసరాలను అర్థం చేసుకుని కొత్త ఆలోచనలతో పరిశ్రమలఅభివృద్ధికి తోడ్పడాలన్నారు. జిల్లాను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేసేందుకు యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు, మౌలిక సదుపాయాలు, రుణ సౌకర్యాలు, వివిధ ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యం.ఎస్.ఎం.ఇ ల అభివృద్ధికి మార్కెట్ అనుసంధానం, సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యతా ప్రమాణాలు, ప్రభుత్వ సంస్థలతో సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు.యం.ఎస్.ఎం.ఇ ల పోటీతత్వాన్ని పెంపొందించడమే లక్ష్యం:-"మార్కెట్ అనుసంధానం, నాణ్యత, సాంకేతికత ద్వారా యం.ఎస్.ఎం.ఇ ల పోటీతత్వాన్ని బలోపేతం చేయడం" అనే ప్రధాన అంశంతో మీవీజు ౹శీశీశ్రీ =శీశీఎజ×ుణ, హైదరాబాద్ మరియు ఆంధ్రప్రదేశ్ ఎస్ ఎం ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఆర్ఏ ఎంపి పథకం కింద రెండు రోజుల వెండర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక జిల్లా - ఒక ఉత్పత్తి, ఛ్శీఱుఖుజూబతీ జతీశీఎష్ట్రవ్ ఝుఎవంకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. ఈ రంగాల్లో పనిచేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తలకు మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ పథకాలు, నాణ్యతా ప్రమాణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, బ్రాండింగ్, ఎగుమతులు, ప్రముఖ కొనుగోలుదారులతో ప్రత్యక్ష మార్కెట్ అనుసంధానం వంటి అంశాలపై చే నిపుణులు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.ఉత్పత్తుల ప్రదర్శనకు ప్రత్యేక స్టాళ్లు:-

వెండర్ డెవలప్మెంట్ కార్యక్రమంలో పాల్గొంటున్న ఎం ఎస్ ఎం ఈ , పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ప్రత్యక్షంగా ప్రదర్శించేందుకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్లలో౹ాతీశీఎవంంవస ప్ ౹ాప్తతీఅఎజూ & ఖీఅంప్త్ర, ఛ్శీఱుఖుజూబతీ జతీశీఎష్ట్రవ్ ఝుఎవంతో పాటు వివిధ మీవీజులకు చెందిన ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శన ద్వారా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను కొనుగోలుదారులు, ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు, పరిశ్రమ నిపుణులు, ఇతర సందర్శకులకు నేరుగా పరిచయం చేసుకునే అవకాశం లభిస్తోందన్నారు. కొత్త మార్కెట్ అవకాశాలు, వ్యాపార సంబంధాలు, కొనుగోలుదారులతో ప్రత్యక్ష అనుసంధానం ఏర్పడేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఎం ఎస్ ఎం ఈ టి ఆర్ పి ఐ టి డి డిప్యూటీ డైరెక్టర్ శ్రీ ఎస్. వెంకట కృష్ణ మాట్లాడుతూఈ కార్యక్రమం ద్వారా పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎం ఎస్ ఎం ఈ కు మార్కెట్, నాణ్యత, సాంకేతికత, కొనుగోలుదారులతో అనుసంధానం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. జిల్లాలోని ఎం ఎస్ ఎం ఈ తమ ఉత్పత్తుల నాణ్యతను పెంచుకోవడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీపడే విధంగా అభివృద్ధి చెందాలని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు. మంగపతి రావు, నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి నిష్యాంత్ చంద్ర,

నేషనల్ వర్కింగ్ నెంబర్ ఏ. బాలాజీ, సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ పి. మధుసూదనరావు, నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ బ్రాంచ్ మేనేజర్ రామారావు, యువ పారిశ్రామికవేత్తలు, ఎం ఎస్ ఎం ఈ వ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..





# ఇంటర్ బోర్డులో విజిలెన్స్ తనిఖీలు

నాంపల్లిలోని తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యాలయంలో విజిలెన్స్ సోదాలు జరిగాయి. విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ విభాగం తనిఖీలు కొసాగిస్తోంది. 2019 ఇంటర్ ఫలితాల వ్యవహారంలో గ్లోబరీనా సంస్థ అవకతవకలకు

పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మార్కుల్లో తప్పులు దొర్లడంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో సీఎం ఆదేశాలతో విజిలెన్స్,

ఎన్ఫోర్స్మెంట్ విభాగం రంగంలోకి దిగింది. ఇంటర్ బోర్డు మాజీ

కార్యదర్శి అశోక్‌ను విజిలెన్స్ అధికారులు విచారిస్తున్నారు.

# స్వాతి నక్షత్రం సందర్భంగా యోగానంద లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 19 నంది పత్రిక** శ్రావణమాసం బుధవారం స్వాతి నక్షత్రం సందర్భంగా ఆళ్లగడ్డ మండలం పెద్ద కందుకూరు గ్రామంలో వెలసిన శ్రీ యోగానంద లక్ష్మి నరసింహ స్వామి సన్నిధిలో ఉదయం కేశవ డెంటల్ హాస్పిటల్ మురళీమోహన్ రెడ్డి రమాదేవి, భక్తులచేత అభిషేకాలు, విశేష పూల అలంకరణ జరిగినది. అక్కడికి ,వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు మధ్యాహ్నం ఒంటిగంటకు అన్న ప్రసాద వితరణ పూజ దాతల చేతుల మీదగా జరిగినది. శ్రీరామ దండు భజన సంఘం ( పుల్లయ్య), ఉయ్యాలవాడ శివాలయం భజన సంఘం వారిచే భజన కార్యక్రమం నిర్వహించడం జరిగినది .

# యువతకు ఏం చేశారు

## రాష్ట్ర వైకాపా కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి

### ఆళ్లగడ్డ అభివృద్ధికి ఎవరు అడ్డంకి

### రాష్ట్ర వైకాపా కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి




**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 19 నంది పత్రిక:** ఆళ్లగడ్డ అభివృద్ధికి ఎవరు అడ్డంకి అని రాష్ట్ర వైకాపా కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి ప్రశ్నించారు. పట్టణంలోని స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాదులో ఆన్స్ అఖిల పేరిట ఈనెల 23న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ యువతతో సమావేశం నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. యువతకు ఏమి చేశారని ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాల ఊసే లేదన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి ఏమైందని అడిగారు. ఆళ్లగడ్డ అభివృద్ధిపై యువతతో ముఖాముఖి వేదిక ఎక్కడ ఏర్పాటు చేయాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. కమిషన్ లేని ఆళ్లగడ్డ ఎప్పుడు ఉంటుందో అప్పుడు ఆళ్లగడ్డ బాగుపడుతుందన్నారు. నేటి వరకు శిల్పులకు అవసరమైన రాయి కోసం ఎక్కడ కూడా క్వారిని ఏర్పాటు చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అన్ని విధాల మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆళ్లగడ్డలో ఇంటి నిర్మాణం చేపట్టాలన్న భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ట్రాక్టర్ ఇసుక ధర రూ.7,500కు చేరిందన్నారు. గత వైకాపా హయాంలో కేవలం రూ.3,500 నుంచి 4 వేలకు అందుబాటులో ఉండేదని గుర్తు చేశారు. నేడు పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలుసు అన్నారు. అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అందరిని ఆహ్వానించడం హాస్యాస్పదం అన్నారు. స్థానిక సమస్యల వల్ల కోళ్ల ఫారాలు ఏర్పాటు చేయడానికి ఆసక్తి ఉన్న పలువురు ముందుకు రావడం లేదన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు.

# రెరా అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొనొద్దు

### రెరా అనుమతి పరిశీలించాలి

### ప్రాజెక్టుల నమోదు తప్పనిసరి

### కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలి

### రెరా చైర్మన్ శివారెడ్డి



**కర్నూలు సిటీ నందిపత్రిక** రెరా అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా) చైర్మన్ శివారెడ్డి సూచించారు. బుధవారం కర్నూలులోని హోటల్ కె. ఫార్చ్యూన్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు, డెవలపర్లు, ఏజెంట్లు, ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్‌లు తదితరులు పాల్గొని రెరా నిబంధనలపై చైర్మన్ అవగాహన కల్పించారు. రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు కొనుగోలుదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు రెరా నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.ఏపీ రెరాలో ఇప్పటి వరకు తమ ప్రాజెక్టులను నమోదు చేసుకోని నిర్మాణదారులు, డెవలపర్లు వెంటనే ప్రాజెక్టులను నమోదు చేసుకోవాలని సూచించారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, ఏజెంట్ల నమోదు, నిబంధనల అమలు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని స్పష్టం చేశారు.కొనుగోలుదారులు ప్లాట్లు లేదా ఇతర రియల్ ఎస్టేట్ ఆస్తులు కొనుగోలు చేసే ముందు సంబంధిత ప్రాజెక్టుకు రెరా అనుమతి, నమోదు ఉందా లేదా పరిశీలించుకోవాలని సూచించారు. రెరా నిబంధనలకు అనుగుణంగా ఉన్న ప్రాజెక్టులనే ఎంపిక చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను నివారించవచ్చన్నారు. రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన చట్టాలు, నిబంధనలు, ప్రాజెక్టుల నమోదు, కొనుగోలుదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు.




printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద ఫ్రాన్స్ కల్చర్ ప్రాసెసింగ్ యూనిట్ల పరిశీలన.



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 19 నంది పత్రిక**

పశ్చిమ గోదావరి జిల్లాను కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక "ఒక జిల్లా ఒక ఉత్పత్తి" కార్యక్రమం కింద ప్రత్యేక ఉత్పత్తి జిల్లాగా ప్రకటించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఫ్రాన్స్ కల్చర్, ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకఒక జిల్లా ఒక ఉత్పత్తి ( ఓ డి ఓ పి) బృందం జిల్లాలో పర్యటిస్తోంది. ఈ సందర్భంగా బుధవారం భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని ఒక జిల్లా ఒక ఉత్పత్తి బృందం సభ్యులు ఇష్‌దీప్ చంద్, స్మిత్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఫ్రాన్స్ కల్చర్, ఆక్వాకల్చర్, ప్రాసెసింగ్ రంగాల అభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యం, ప్రాసెసింగ్ యూనిట్ల పనితీరు, మార్కెటింగ్ అవకాశాలు తదితర అంశాలపై వారు జిల్లా కలెక్టర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఒక జిల్లా, ఒక ఉత్పత్తి బృందం సభ్యులు మాట్లాడుతూ, ఒక జిల్లా ఒక ఉత్పత్తి కార్యక్రమం కింద భీమవరం జిల్లాకు ఫ్రాన్స్ కల్చర్, ప్రాసెసింగ్ రంగాన్ని గుర్తించే అంశంపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఫ్రాన్స్ ప్రాసెసింగ్ యూనిట్లను, వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని, మౌలిక సదుపాయాలను, ఉపాధి కల్పన, ఎగుమతుల అవకాశాలు, మార్కెటింగ్ వ్యవస్థ తదితర అంశాలను పరిశీలించి, సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని వెల్లడించారు. జిల్లాలో ఆక్వాకల్చర్ రంగం విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, ఫ్రాన్స్ ఉత్పత్తి, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్, ఎగుమతులకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేయడం ద్వారా జిల్లాకు "ఒక జిల్లా ఒక ఉత్పత్తి" కార్యక్రమం కింద ప్రత్యేక గుర్తింపు లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



ఒక జిల్లా, ఒక ఉత్పత్తి కార్యక్రమం ద్వారా స్థానికంగా ప్రత్యేకత కలిగిన ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించడం, ఉత్పత్తిదారులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంపొందించడం వంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఫ్రాన్స్ కల్చర్, ప్రాసెసింగ్ రంగానికి మరింత ప్రోత్సాహం లభించేలా అవసరమైన అంశాలను బృందం పరిశీలిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్, హ్యాండ్లూమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా మంజూరైన పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తిచెయ్యాలి.

**జిల్లాలో హర్ ఘర్ జల్ జీవన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు నూరుశాతం లక్ష్యాలను సాధించాలి.**

**ప్రజలకు రక్షిత మంచినీటిని పుష్కలంగా రెండు పూటలు అందించేలా అధికారులు సమన్వయంతో లక్ష్యాలను అధిగమించాలి.**

**జిల్లా నీటి మరియు పారిశుధ్య మిషన్ ( డి డబ్ల్యు ఎస్ ఎం ) సమీక్ష సమావేశంలో**

**జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...**



**ఏలూరు, బ్యూరో చీఫ్ ఆగస్టు 19: నంది పత్రిక** జిల్లా కలెక్టరేటు జిల్లా కలెక్టరు ఛాంబర్లో బుధవారం జిల్లా నీటి మరియు పారిశుధ్య మిషన్ ( డిడబ్ల్యూఎస్ఎం) భాగంగా జలజీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్, తదితర అంశాలుపై జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో మంజూరైన రూ 264.61 కోట్లతో 1223 పనులు, తదితర అంశాలుపై మండలాలు, శాఖలు వారీగా జిల్లా కలెక్టరు సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన పనులను నిర్దేశించిన వ్యవధిలోగా పూర్తిచెయ్యాలని, నాణ్యతా ప్రమాణాలలో లోటు కనిపించినా అలసత్వం వహించినా సంబంధిత అధికారులు శాఖా పరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టరు హెచ్చరించారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో హర్ ఘర్ జల్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు 603 గ్రామాలకు 306 పూర్తయ్యాయని, మిగతా గ్రామాలు నిర్దేశించిన సమయంలో పూర్తిచెయ్యుటకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుళాయిలు ద్వారా ప్రతీ కుటుంబానికి అవసరమైన నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, నీటిసరఫరా పథకం కింద లబ్ధిదారులు ఇంటివరకు పైపులైన్ల ఏర్పాటు పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. ప్రజలకు కుళాయిలు ద్వారా నీటిని అందించేందుకు సరిపడా నీటివనరులు ఉండేలా చూడాలని లేకపోతే నీటి కొరత ఏర్పడుతుందని తెలిపారు. ముందుగానే గుర్తించి నీటి కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చెయ్యాలని, ఎట్టిపరిస్థితులోని నీటికొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో త్రాగునీరు, టాయిలెట్లలో వినియోగానికి అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఎక్కడ ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. జిల్లాలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న నీటిపారిశుధ్య కార్యక్రమాలు అమలు తీరుపై ప్రతిరోజు అధ్యయనం చేస్తూ, ప్రతి రోజు సాయంత్రానికి పూర్తిస్థాయిలో నివేదికలు ఇవ్వాలని అన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని నిరంతరం అందుబాటులో ఉంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలని, ఎప్పటికప్పుడు నీటిపరీక్షలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి వనరులు నిర్వహణ, పారిశుధ్య కార్యక్రమాలు అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పెండింగులో ఉన్నపనులుపై దృష్టిసారించి పూర్తిచెయ్యాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. ఇబ్బందులు ఎదురైనను అధిగమించి ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరాను రెండు పూటలు పుష్కలంగా అందించే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఈవో పి.జగదాంబ, ఆర్డబ్ల్యూఎస్ యస్ఇ బి.వి.గిరి, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జి.వి.కె. మల్లిఖార్జునరావు, డిఆర్డిఏ పిడి టి.వి.విజయలక్ష్మి, గ్రౌండు వాటరు డిడి పైలా కోదండరామ్, సంబంధిత శాఖలు అధికారులు పాల్గొన్నారు

# ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేలా పనిచేయాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం జె అభిషేక్ గౌడ**



**ఏలూరు బ్యూరో చీఫ్, ఆగష్టు, 19 నంది పత్రిక** : ఏలూరు నగరంలోని ప్రజలకు మెరుగైన పౌర సేవలందించేలా పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఏలూరు నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా. ఎం.జె. అభిషేక్ గౌడ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ఏలూరు నగరపాలక సంస్థ లోని పలు విభాగాలను జేసీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ సమావేశపు హాలులో అధికారులతో పారిశుధ్యం, ప్రజారోగ్య విభాగం,ఇంజనీరింగ్ విభాగం పనులు టౌన్ ప్లానింగ్, రెవెన్యూ , మెప్మా విభాగం కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా డా. అభిషేక్ గౌడ మాట్లాడుతూ ఏలూరు నగరంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనపడకూడదని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైన్లలో పూడిక తీసి, వర్షాకాలంలో ముంపు ప్రమాదం లేకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులు నిర్దేశించిన సమయానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రతీరోజూ ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించేలా పర్యవేక్షించాలన్నారు. ప్రజలు రోడ్లపై చెత్తను వేయకుండా చూడాలన్నారు. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ఏలూరు నగరంలో వర్షాకాల సమయంలో ఈదురుగాలులు సమయంలో కూలిపోయే ప్రమాదం ఉన్న హోర్డింగ్ లను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ అన్నప్రగడ భాను ప్రతాప్ అదనపు కమిషనర్ డి. శ్రీనివాస రావు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లాలో స్థానిక సంస్థ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నాం

**జిల్లా కలెక్టర్ వేట్రి సెల్వి**



**ఏలూరు బ్యూరో చీఫ్, ఆగష్టు, 19 నంది పత్రిక** ఏలూరు జిల్లాలో స్థానిక సంస్థ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమీషనర్ కార్యాలయం నుండి బుధవారం స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల ప్రక్రియ బాధ్యయుతమైన విధులతో కూడుకున్నదని, ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు, సిబ్బంది నిబంధనల మేరకు ఎన్నికల విధులు నిర్వర్తించాలన్నారు. ఓటర్ల జాబితాలు, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి సమీకరణ, సిబ్బంది, భద్రతా ఏర్పాట్లపై పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలన్నారు. ఏలూరు జిల్లా నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 541 గ్రామ పంచాయతీలలోని 5664 వార్డులలో ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ కు తెలియజేసారు.

# సెంట్రల్ డెల్టా ఆధునికీకరణకు రూ. 3,000 కోట్లు సీఎం చంద్రబాబు హామీ

**అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు అభ్యర్థినపై స్పందించిన సీఎం**



**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగస్టు 19 నంది పత్రిక** గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలోని సాగునీటి వ్యవస్థ పునరుద్ధరణ, కాలువల ఆధునికీకరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ నిధులను కేటాయించనుంది. సెంట్రల్ డెల్టా ఆధునికీకరణ పనుల కోసం రూ. 3,000 కోట్లు కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు . డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు చేసిన ప్రత్యేక విజ్ఞప్తి మేరకు సి ఎం ఈ నిర్ణయం తీసుకున్నారు .

**ఆధునికీకరణ ప్రాధాన్యతలు కీలక ముఖ్యాంశాలు:** కాలువలు, లాకుల మరమ్మతులు: దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రధాన కాలువలు, బ్రాంచ్ కెనాల్స్, శిథిలావస్థకు చేరిన లొల్ల లాకులు తదితర కీలక నీటి నియంత్రణ వ్యవస్థల సమగ్ర పునరుద్ధరణకు ఈ నిధులు కేటాయిస్తారని ఆనందరావు తెలిపారు. చివరి ఆయకట్టుకు సాగునీరు: డెల్టా చివరి భూములకు (టెయిల్ ఎండ్ ప్రాంతాలకు) సైతం సాగునీరు సజావుగా చేరేలా పూడికతీత, కాలువల లైనింగ్ పనులు చేపట్టాలనే తన ఆలోచన కార్యరూపం దాలుస్తుండటం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గారు అన్నారు.డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన: వర్షాకాలం, వరదల సమయంలో ముంపు బారిన పడే లంక గ్రామాలు, లోతట్టు వ్యవసాయ భూములను కాపాడేందుకు డ్రైనేజీల ప్రవాహ సామర్థ్యం పెంపు. ఉమ్మడి గోదావరి డెల్టాలో వరితో పాటు ఉద్యానవన పంటలు, ఆక్వా రంగానికి మేలైన నీటి నిర్వహణ సౌకర్యాలు ఈ ప్రాజెక్టు ద్వారా అందుతాయని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. కోనసీమ ప్రాంతంలో సాగునీటి ఎద్దడి, ముంపు సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావాలంటే సెంట్రల్ డెల్టా ఆధునికీకరణ అత్యవసరమని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గారు స్పష్టం చేశారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే రూ. 3,000 కోట్ల భారీ నిధులను కేటాయించేందుకు సి ఎం సుముఖత వ్యక్తం చేయడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నేతలు ముఖ్యమంత్రికి స్థానిక ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు .

# బీసీలకు న్యాయం చేసిన ఏకైక పార్టీ టీడీపీ.. ఎంపీ పుట్టా మహేష్ కుమార్.

**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగస్టు 19 నంది పత్రిక**: స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఏపీ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసిన ఎంపీ, ఆనాడు అన్న ఎన్టీఆర్ పార్టీని స్థాపించినప్పటి నుంచి బీసీల అభ్యున్నతికి పాటుపడుతున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లకు కోతపెట్టి అన్యాయం చేసిందని, తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకోవడంపై బీసీ కులాల తరపున ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో రాజ్యాధికారంలో బీసీలకు అవకాశాలు పెరుగుతాయని, ఎంతో మంది బీసీ కులాల యువకులకు నాయకులుగా ఎదిగే అవకాశం లభిస్తుందని ఎంపీ సంతోషం వ్యక్తం చేశారు. చట్ట సభల్లో కూడా బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో ఇప్పటికే తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ఎంపీ గుర్తు చేశారు. బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న టీడీపీ కూటమి ప్రభుత్వానికి రాష్ట్రంలోని బీసీ కులాలన్నీ రుణపడి ఉంటాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు.



# ఆర్.ఎస్.ఐ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

**కడప బ్యూరో చీఫ్ ఆగస్టు 19నంది పత్రిక** జిల్లా పోలీసు శాఖలో సిబ్బంది సంక్షేమం, పరిపాలనా సౌలభ్యం మరియు విధుల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టే దిశగా మరో ముందడుగు పడింది. ఇందులో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలు సమీపంలోని భవనాన్ని ఆధునీకరించి ఏర్పాటు చేసిన ఆర్.ఎస్.ఐ ల కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించి, సిబ్బందికి అందుబాటులో ఉండాల్సిన మౌలిక సదుపాయాలు, కార్యాలయ నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. పోలీసు సిబ్బంది తమ విధులను మరింత సమర్థవంతంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు అవసరమైన వాతావరణం కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు. పోలీసు శాఖలో పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ, సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించేందుకు నిరంతరం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్.పి(పరిపాలన) కె.ప్రకాష్ బాబు అడిషనల్ ఎస్.పి (ఏ.ఆర్ ) బి.రమణయ్య ఆర్.ఐ లు శివరాముడు, సోమశేఖర్ నాయక్, టైటస్, ఆర్.ఎస్.ఐలు, ఏ.ఆర్.ఎస్.ఐ లు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు



# మచిలీపట్నం "వై జే ఆర్,డి ఎం ఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో ముగిసిన కార్పొరేట్ వర్క్ షాప్.







## నిపుణులు కల్పించిన అవగాహన అద్భుతం..అతిథుల ప్రశంసలు

**మచిలీపట్నం, బ్యూరో చీఫ్ ఆగస్టు.19 నంది పత్రిక**

పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఎప్పటికప్పుడు విద్యార్థులు ఆ పెరిగే సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని అందుకు రోజువారీ నేర్చుకుంటున్న విద్యతో పాటు ఆయారంగాల్లో నిపుణుల సలహాలు,మెళు కువలు నేర్చుకోవాల్సిన అవసరం ఎంతోఉందని బెంగళూరు కి చెందిన సాఫ్ట్వేర్ రంగ నిపుణురాలు (ఏ ఐ ఆటోమేషన్) చలాది దమయంతి ,నిపుణులు చలాది సతీష్ లు విద్యార్థులకు ఈరోజు జరుగుతున్న కార్పొరేట్ వర్క్ షాప్ లో సూచించారు. మచిలీపట్నంలో ని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల "వై జే ఆర్ డి ఎం ఎస్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్" కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకోసం గత మూడురోజులుగా డాసేతు ఏ ఐ,మరియు కోడ్ క్రాఫ్ట్ సంస్థల నిపుణుల సహకారంతో సోమవారం నుండి ప్రారంభమైన ఫ్రమ్ ప్రాంప్ట్ టు ప్రొడక్షన్ అన్న థీమ్ తో విద్యార్థులకు. ప్రాంప్ట్ ఇంజనీరింగ్ , ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, (ఏ ఐ) జెనరేటివ్ ఏ ఐ, మరియు ఎన్ 8ఎన్ ఆటోమేషన్ తదితర ఆధునిక సాఫ్ట్వేర్ విద్యారంగానికి సంబంధించి ఈ రోజు వర్క్ షాప్ లో కల్పించిన అవగాహన ఎంతో ఉపయుక్తంగా ఉందని, ఏ ఐ,ఆటోమేషన్ సబ్జెక్టుల మీద దమయంతి ,సతీష్ లు కల్పించిన వివరణాత్మక అవగాహన తమ విద్యార్జనకు ఎంతో ఉపయుక్తంగా. ఉంటుందని పలువిద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ. మూడురోజుల కార్పొరేట్ వర్క్ షాప్ లో మొదటిరోజు సాఫ్ట్వేర్ రంగ నిపుణులు సురేష్ కుమార్ చెరుకూరి,(కో ఫౌండర్,కోడ్ క్రాఫ్ట్ ప్రై లిమిటెడ్ )ల్కో ఫౌండర్,మనోజ్ దాసరి, (స్ట్రాటజిక్ సైబర్ సెక్యూరిటీ మరియు టెక్నాలజీ లీడర్) చలాది సతీష్ యుఐ పాత్ పవర్ ఆటోమేట్,అ8అ, జెనరేటివ్ ఏ ఐ,మరియు ఏ ఐ పవర్డ్ ఆటోమేషన్ నిపుణులు) ఈ వర్క్ షాపులో ప్రారంభ రోజు అవగాహన వర్క్ షాప్ లో వారి కి సాఫ్ట్ వేర్ రంగంలో ఉన్న పై అంశాలలో సోదాహరణ వివరణ ఇచ్చారు.మూడవ ముగింపు రోజున సతీష్,దమయంతి లు కల్పించిన అవగాహన పట్ల విద్యార్థి,విద్యార్థినిలు సాఫ్ట్వేర్ రంగంలో ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లు,పోటీ తత్వం ఎలా అధిగమించి ఈ రంగంలో నిలబడటం ఎలా అన్న వివరణాత్మక అవగాహన తమకు ఎనలేని దిక్సూచి లా ఉందని తరచుగా ఇలాంటి నిపుణులతో ఈ సదస్సులు నిర్వహిస్తే తాము ఉపాధ్యా యులిస్తున్న శిక్షణతో పాటు మరింత మెలుకువలు నేర్చుకుని ఈ కళాశాలకు. ఉన్నత స్థాయిలో పేరుతెచ్చేలా తగిన ప్రజ్ఞ సాధించుటకు ఈ అవగాహన సదస్సులు తోడ్పడతాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మూడురోజులపాటు జరిగిన వర్క్ షాప్ ను ప్రారంభ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వీరమాచినేని కిరణ్,ప్రిన్సిపాల్ డా.టి రవికుమార్,కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా.సయ్యద్ సాదత్ అలీ,మరియు ఏ ఐ, ఎం ఎల్ విభాగాధిపతి ప్రొఫెసర్. ఎన్ సుష్మ,తదితరులు పాల్గొనగా మూడవరోజు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ నిపుణులు చలాది సతీష్ ,దమయంతి, దాసరి మనోజ్ లకు శాలువ మెమెంటో లతో సత్కరించారు.

ఈ ముగింపోత్సవంలో ఇంజనీరింగ్ కాలేజ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వీరమాచినేని కిరణ్, ప్రిన్సిపాల్ డా.రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.నాగజ్యోతి, సి ఎస్ సి హెచ్ ఓ డి డా.సాదత్ అలీ ఏ ఐ ఎం ఎల్ హెచ్ ఓ డి ప్రొఫెసర్ ఎం.సుష్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు తమ సందేశంలోవిద్యార్థులను కేవలం థియరీ పరిజ్ఞానానికే పరిమితం చెయ్యకుండా ప్రస్తుత ఐ టి అవసరాలకు తగినట్లు తమ విద్యార్థులను తీర్చి దిద్దేందుకు ఇలాంటి అనుభవజ్ఞులైన ఐ టి నిపుణులతో ఇలా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వై జే ఆర్ ,డి ఎంఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ యాజన్యమాన్యం నిర్ణయం విద్యార్థులకు తమవంతు చదువు చెప్పేసి వదలిపెట్టకుండా,వారి భవిష్యత్ కి కూడా నిర్వహిస్తున్నట్లు వారు ప్రసంగంలో హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.ఇలాంటి నిపుణుల అవగాహన సదస్సు నిర్వహించిన తీరు అభినందనీయమని ఎంతో ఉపయోగమన్నారు. వర్క్ షాప్ లో సాఫ్ట్వేర్ నిపుణుల ట్రైనింగ్ అద్భుతం అని వారు ప్రశంసించారు.

# మైలవరం నియోజకవర్గంలో రూ.13.44 కోట్లతో రహదారుల అభివృద్ధి.

### ఏపీ రూరల్ రోడ్స్ స్ట్రెంగ్తనింగ్ ప్రాజెక్ట్ కింద నిధులు మంజూరు.

### -మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు వెల్లడి.



**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగస్టు 19 నంది పత్రిక**మైలవరం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు.ఏపీ రూరల్ రోడ్స్ స్ట్రెంగ్తనింగ్ ప్రాజెక్ట్ కింద మైలవరం నియోజకవర్గానికి మొత్తం రూ.13.44 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఆయన వెల్లడించారు. ఈ నిధుల్లో భాగంగా జి.కొండూరు మండలం కవులూరు గ్రామంలో ఐటీ రోడ్డు నుంచి కవులూరు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.65 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు మెరుగుపడితే ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. గతంలో ఇబ్బందులు ఎదుర్కొన్న రహదారులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.కవులూరు-శాంతినగర్ రహదారి నిర్మాణంతో గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మైలవరం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం సహకరిస్తోందని, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు తెలిపారు. మంజూరైన రూ.13.44 కోట్లతో చేపట్టే రహదారి పనులు పూర్తయితే నియోజకవర్గంలోని పలు గ్రామాలకు మెరుగైన అనుసంధానం ఏర్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) , స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదుకి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టిన రెండేళ్ల పాలన.





## అభివృద్ధి, సంక్షేమంతో దూసుకెళ్తున్న కూటమి ప్రభుత్వం.

### -మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

### కవులూరులో ఇంటింటికీ తెలుగుదేశం.

**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగస్టు 19 నంది పత్రిక**

ఏపీలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టిందని, అభివృద్ధి, సంక్షేమంతో ప్రభుత్వం దూసుకెళు _న్నదని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గంలో చేపట్టిన "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు మండలంలోని కవులూరు గ్రామంలో మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు బుధవారం సాయంత్రం పాల్గొన్నారు. కవులూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని కుటుంబాలతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. అదే సమయంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, స్థానిక అవసరాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**ప్రజల వద్దకే పాలన** ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు స్పష్టం చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా స్థానికంగా అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చన్నారు. మైలవరం నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

అమరావతి అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల్లో పురోగతి, పేదలకు సంక్షేమ పథకాల అమలు, భారీగా పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ప్రధాని మోడీ ఆశీస్సులతో, సీఎం చంద్రబాబు సారథ్యంలో, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు, మంత్రి నారా లోకేష్ గారి నాయకత్వంలో ఏపీలో సమగ్రాభివృద్ధికి కృషి జరుగుతోందన్నారు. కవులూరులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారికి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

"ఇంటింటికీ తెలుగుదేశం2026" కార్యక్రమం ద్వారా మైలవరం నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో కుటుంబాలను నేరుగా కలుసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు అభినందించ తెలిపారు.ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న జువ్వా బోసిబాబును ఘనంగా సత్కరించి, అభినందించారు. మహిళలు, వృద్ధులు, యువతతో ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారు మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు బాధ్యతలు చేపట్టిన వర్ల రామయ్య కు శాలువాతో సత్కరించి గజమాలవేసి శుభాకాంక్షలు తెలియజేసిన పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్ బుద్ధ వెంకన్న

**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగస్టు 19 నంది పత్రిక** పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతు 1982 విజయవాడలో నేను పోలీస్ ఆఫీసర్గా పని చేశాను.టిడిపిలో ఎంతమంది బీసీ నాయకులు అధికారాన్ని చేపట్టారు.. బుద్ధ వెంకన్న నాయకత్వంలో ఈ నియోజకవర్గం సుభిక్షంగా ఉంటుంది.. నేను రావాలని ఎప్పుడూ కోరుకోలేదు..అనుకొని పరిస్థితుల్లో నాకు రాజ్యసభ దక్కలేదు..దళిత వర్గానికి చెందిన నాయకుడిగా నాకు ఎమ్మెల్సీ ఇవ్వడం జరిగింది.. అలాగే వెనుకబడిన వడ్డెర వర్గానికి చెందిన ఒక మహిళను ఎమ్మెల్సీగా చేయడం అది ఒక చంద్రబాబు నాయుడుకె సాధ్యం.. అన్నారు.ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి పశ్చిమ నియోజకవర్గం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలనే లక్ష్యంతో తీసుకున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయానికి మరింత బలం చేకూరుస్తుందని అన్నారు. చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తూ, వారికి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అవకాశాలు కల్పిస్తున్నారని బుద్ధా వెంకన్న పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా డివిజన్ స్థాయి నుంచి నాయకత్వాన్ని ప్రోత్సహించే గొప్ప అవకాశం లభించిందన్నారు.పశ్చిమ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి డివిజన్లో పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని బుద్ధా వెంకన్న కోరారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, పార్టీ పట్ల ప్రజల్లో మరింత విశ్వాసం పెంచేలా కృషి చేయాలని సూచించారు.బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటో కి పాలభిషేకం చేసి, పశ్చిమ నియోజకవర్గం తరఫున మరోసారి ధన్యవాదాలు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచేందుకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని బుద్ధా వెంకన్న అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వర్ల రామయ్య , నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డుండి రాకేష్ గారు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్ , ఎండి ఫతావుల్ల, ఎస్.కె కొట్టేటి హనుమంత రావు, కామ దేవ రాజు, మరియు డివిజన్ అధ్యక్షు లు, ప్రధాన కార్యద ర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి ఇంచార్జ్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సెప్టెంబరు 12వ తేదీ జిల్లా వ్యాప్తంగా జరిగే జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారానికి అధికారులు కృషిచేయ్యాలి.



## జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ...

**ఏలూరు, బ్యూరో చీఫ్ ఆగస్టు 19 నంది పత్రిక** :రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశాలు ప్రకారం ఉమ్మడిపశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి ఎస్.శ్రీదేవి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పోలీసు అధికారులతో బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీదేవి మాట్లాడుతూ సెప్టెంబరు 12వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఈ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులను రాజీ చేయడం జరుగుతుందని తెలిపారు. కేసులు పరిష్కారం నిమిత్తం తీసుకోవలసిన చర్యలుపై చర్చించడం జరిగిందని, అలాగే కక్షిదారులు రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులలో పరిష్కరించుకోవడానికి కృషిచెయ్యాలని అన్నారు. కక్షిదారులు సంబంధిత పోలీసు అధికారులను కాని న్యాయ స్థానాలను కాని సంప్రదించి, పరిష్కారానికి కృషిచెయ్యాలని సూచించారు.ఈ జాతీయ లోక్ అదాలత్ నందు కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఇరు పార్టీలు గెలుపొందినట్లు అవుతుందని, అలాగే సమయం,డబ్బు ఆదా చేయవచ్చని సూచించారు. కేసులు పరిష్కారంలో సలహాలు పొందటానికి 15100 ద్వారా సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి శ్రీమతి యు.ఇందిరా ప్రియదర్శిని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి యన్.శ్రీలక్ష్మి, ఇతర న్యాయమూర్తులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# నూతన కార్యవర్గానికి ఎస్పీ శుభాకాంక్షలు

పోలీస్ సిబ్బంది సంక్షేమంతో పాటు శాఖలో సమన్వయాన్ని పెంపొందిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పోలీస్ అధికారుల సంఘం సహకరించాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ అధికారుల సంఘం 2026 ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు అధ్యక్షుడు ఎస్. చంద్రశేఖర్ (ఏఆర్పీసీ 433) నేతృత్వంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ఎస్పీకి పరిచయం చేసుకున్నారు. ఉపాధ్యక్షులు బి. సోములు (ఆర్ఐ, ఎంటీఓ), బి. వెంకన్న (ఎస్ఐ, నర్సింహులపేట), కార్యదర్శి జి. శేఖర్ (ఆర్ఎస్ఐ), సంయుక్త కార్యదర్శి బి. రామయ్య (ఏఆర్పీసీ 1094), ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. అనిల్ (పీసీ 06, మహబూబాబాద్ టౌన్ పీఎస్), కోశాధికారి ఎల్. మంగీలాల్ (పీసీ 78, డోర్నకల్ పీఎస్), కార్యవర్గ సభ్యులు సుప్రజ, సురేష్, నాగమణి, ఈ. సురేష్, యాకన్నా గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల



నోడల్ అధికారిగా ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఎన్నికల పరిశీలకుడిగా ఇన్‌స్పెక్టర్ హతీరామ్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఎస్పీ డా. శబరీష్ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, శాఖలో సమన్వయం, క్రమశిక్షణతో కూడిన విధి నిర్వహణలో పోలీస్ అధికారుల సంఘం మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

# ఎన్నికల్లో బస్సు గుర్తును గెలిపించాలి

రాబోయే ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో బస్సు గుర్తుపై ఓటు వేసి ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌ను గుర్తింపు సంఘంగా గెలిపించాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో ఏఐటీయూసీ అనుబంధ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బ్రాంచ్ సమావేశం నిర్వహించి, బస్సు గుర్తును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన కార్మిక సంఘంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తున్న ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు



పని భద్రత కల్పించాలని దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ఇబ్బందులకు గురిచేసినందుకే ఆ ప్రభుత్వానికి కార్మికులు తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మికులను విస్మరిస్తే అదే విధమైన సమాధానం చెప్పాల్సి వస్తుందని అన్నారు. రాబోయే గుర్తింపు ఎన్నికల్లో బస్సు గుర్తుపై ఓటు వేసి ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. వివిధ కార్మిక సంఘాల నుంచి ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరిన కార్మికులకు నాయకులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. అజయ్ సారధి రెడ్డి, ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, అప్పారావు, భాస్కర్‌రావు, కృష్ణయ్య, పాషా, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం మండల విప్లవోద్యమంలో చేపూరి రంగన్న పాత్ర మరువలేనినది

పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏజెన్సీ ప్రాంత విప్లవోద్యమంలో చేపూరి రంగన్న నిర్వహించిన పాత్ర విస్మరించలేనిదని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య,పార్టీ మండల కార్యదర్శి మోకాళ్ళ మురళీకృష్ణలు పేర్కొన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ బయ్యారం సబ్ డివిజన్ సీనియర్ నాయకులు చేపూరి రంగన్న 5వ వర్ధంతి సందర్భంగా బయ్యారం, కారుకొండలలో ఆయన సంస్మరణ సభలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఐలయ్య,మురళీకృష్ణలు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసి గిరిజనుల కూలి రేట్ల పెరుగుదల కోసం,వారి జీవనాధారమైన పోడు భూముల సాధన కోసం రంగన్న విశేషమైన కృషి చేశాడని,పేద ప్రజల పక్షాన నిలబడినందుకే ప్రజావ్యతిరేకులు ఆయన ఇంటిని దగ్ధం చెయ్యడం లాంటి చర్యలకు పాల్పడ్డారని అన్నారు.పోలీసు



నిర్బంధం అనుభవించి జైలు జీవితం గడిపినప్పటికీ ఏనాడు ప్రజలను, విప్లవోద్యమాన్ని రంగన్న వదిలిపెట్టలేదని,తుది శ్వాస దాకా విప్లవోద్యమంలో కొనసాగాడని,అనేక ఆటుపోట్ల నడుమ ప్రజలకు అండగా నిలబడి మూడుసార్లు ఉమ్మడి కంబాలపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గా ఎన్నికై ఆదర్శవంతమైన ప్రజా ప్రతినిధిగా నిలిచాడని వారు కొనియాడారు. నేటి యువతరం చేపూరి రంగన్న ఆశయాలను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని వారు పిలుపుని



చ్చారు ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ రామ గిరి బిక్షం,తుడుం వీరభద్రం, ఏపూరి వీరభద్రం,బీరెడ్డి సంగయ్య, యాకూబ్ పాషా,వీరబోయిన ఐలయ్య, మేకపోతుల నాగేశ్వరరావు, బానోత్ నరసింహ,సజ్జ జలంధర్,శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్‌లో పుట్టిన తేదీ మార్పు చేస్తే చర్యలు



బాల్య వివాహాలకు సహకరించే ఉద్దేశంతో ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీలను అక్రమంగా మార్పు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈడీఎం యుగంధర్ హెచ్చరించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలోని మీ-సేవ నిర్వాహకులకు బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరిపేందుకు తల్లిదండ్రులు, మధ్యవర్తులతో పాటు కొంతమంది మీ-సేవ నిర్వాహకులు సహకరిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. బాల్య వివాహాలకు అనుకూలంగా ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీలను మార్చే చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం జిల్లా బాలల పరిరక్షణ అధికారి కమలాకర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని అన్నారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలు చదువుకున్నప్పటికీ చదువుకోలేదని చెబుతూ, ఆధార్‌లో పుట్టిన తేదీని మార్చి 18 సంవత్సరాలు నిండినట్లు చూపించి వివాహాలు జరిపిస్తున్నారని తెలిపారు. గ్రామస్థాయిలోనూ, మీ-సేవ కేంద్రాల నుంచి ఇలాంటి చర్యలకు సహకారం అందుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం బాల్య వివాహానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించే వారందరూ శిక్షార్హులేనన్నారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డు ప్రామాణిక పత్రం కాదని, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం లేదా స్టడీ సర్టిఫికెట్‌ను మాత్రమే ప్రామాణికంగా పరిగణించాలని సూచించారు. బాల్య వివాహాలను నిరోధించడంలో మీ-సేవ నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి నరేష్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ మహేశ్వరి, జెండర్ స్పెషలిస్ట్ అరుణ,
మీ-సేవ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలి

**పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్ల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి**

**జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్**



**అమలాపురం బ్యూరో చీఫ్, ఆగస్టు 19 నంది పత్రిక,** : మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు, లోపాలకు తావులేకుండా ముందస్తు సన్నాహక ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేయాలని సూచించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనిల్ చంద్ర పునేఠా అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ముందస్తు సన్నాహక ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ల జాబితాల ప్రచురణ, ఎన్నికల సంబంధిత ప్రచురణలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల గుర్తింపు, రిజర్వేషన్ల అమలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ముందస్తు సన్నాహక చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు తెలిపారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మొత్తం 10,90,975 మంది ఓటర్లు ఉన్నారని, జిల్లాలోని 19 మండలాల పరిధిలో 342 గ్రామ పంచాయతీలకు సంబంధించి 3,878 వార్డులను గుర్తించినట్లు తెలిపారు. వీటి పరిధిలో మొత్తం 3,968 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓటర్ల జాబితా పేజీలను నిబంధనల మేరకు పరిశీలించి, అవసరమైన చోట అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితాల విభజన, ప్రచురణ తదితర ప్రక్రియలను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల గుర్తింపు, వర్గీకరణ, వర్తింపు ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. డివిజన్, మండల స్థాయిల్లో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రిజర్వేషన్లకు సంబంధించిన వివరాలను ఖచ్చితంగా సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణా తరగతులను నిర్వహించి, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పోలింగ్ విధానం, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఓటర్ల జాబితాల నిర్వహణ, ఎన్నికల సామగ్రి వినియోగం, విధులుబాధ్యతలు, ఎన్నికల నిబంధనలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వాలని తెలిపారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన అన్ని ముందస్తు చర్యలను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సామగ్రి, సిబ్బంది, శిక్షణ, రిజర్వేషన్లు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ వి. సుబ్బారావు, జిల్లా పంచాయతీ అధికారి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# జల్సాల అలవాటుతో ప్రిన్సిపల్ ఇంట్లో దొంగతనం ప్లాన్

**రూపారెడ్డి గుర్తు పట్టడంతో కత్తితో పొడిచి హత్య**

**డబ్బు, సెఫ్‌పోన్ తీసుకుని పరార్**

**వివిధ కోణాల్లో పరిశీలించి ఇద్దరు విద్యార్థుల పట్టివేత**

**హత్యకేసును వివరించిన ఎస్పీ శరత్ చంద్ర**

సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు చేసిన ఘాతుకమని వెలిపారు. ఆ ఇద్దరు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారన్నారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం. ఆ ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించాం. వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం. రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ బాబు అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నిందితుల్లో ఒకరి వద్ద రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ ఉన్నట్లు గుర్తించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది. రూపారెడ్డి నిందితుల్లో ఒకడు అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడు. గతంలో అతడి బ్యాగ్‌లో కొంత డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, టీచర్లు మందలించి డేస్కాలర్‌గా మార్చారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ముందు అతడిని మందలించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్నాడు. నిందితుడికి ఆల్కహాల్ అలవాటు, బైక్‌లపై మోజు ఉంది. నెల క్రితం గోవా టూర్‌కి వెళ్లాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో ఐదురోజుల ముందు నుంచే రూపారెడ్డి ఇంట్లో దొంగతనానికి ప్లాన్ వేసుకున్నారని ఎస్పీ3 వివరించారురు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ వెళ్లాలనే విషయాలపై చర్చించుకున్నారు. ఈనెల 11న స్కూల్ నుంచి వచ్చిన తర్వాత నిందితులు ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ పెట్టుకుని గోడదూకి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో మాస్క్ ఊడిపోవడం, ప్రిన్సిపల్ గుర్తుపట్టడంతో ఆమెను హత్య చేశాడు. 27 సార్లు కత్తితో పొడిచాడు. ఆ సమయంలో ఆమె ఫోన్ కిందపడటంతో దాన్ని తీసుకెళ్లిపోయారు. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదుతో పాటు ఐఫోన్, రూపారెడ్డి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం. నిందితులు మైనర్లు అయినందున వారిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తాం అని ఎస్పీ వివరించారు.

## ఎపిలో పురపాలక ఎన్నికలకు రంగం సిద్ధం

ఏపీలో పురపాలక ఎన్నికల నిర్వహణలో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లను యథాతథంగా అమలు చేస్తూ ముందుకెళ్లనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక శాఖ కమిషనర్, సంచాలకులు ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం.. రాష్ట్రంలోని మొత్తం 123 పురపాలక సంఘాలకు గానూ 100 చోట్ల త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన 87 పురపాలక సంఘాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది నవంబర్ నాటికి పదవీ కాలం పూర్తి చేసుకోనున్న మరో 13 చోట్ల కూడా ఇప్పుడే ఎన్నికలు జరపనున్నారు. న్యాయపరమైన వివాదాలు, ఇతర సమస్యల కారణంగా మిగిలిన 23 పురపాలక సంఘాల్లో ప్రస్తుతానికి ఎన్నికలు సాధ్యపడవని ప్రభుత్వం తెలిపింది. 16వ ఆర్థిక సంఘం తాజా మార్గదర్శకాల ప్రకారం.. స్థానిక సంస్థలకు నిధులు మంజూరు కావాలంటే ప్రజలతో ఎన్నికైన పాలకవర్గం తప్పనిసరి. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోతే పట్టణ స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు ఆగిపోయే ప్రమాదముంది. రాజ్యాంగబద్ధమైన పాలనతో పాటు, ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకునే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎన్నికల పక్రియను వేగవంతం

# లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేశారు



ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా పేరొందిన మల్లూరులోని శ్రీ హేమచల లక్ష్మీ నరసింహస్వామి పర్యాటకుల సౌకర్యార్థం నిర్మించిన "హరిత హోటల్" అధికారుల నిర్లక్ష్యానికి, అక్రమార్కుల అడ్డగోలు దోపిడీకి నిలువుటద్దంగా మారింది. మంగపేట మండలం మల్లూర్ గ్రామంలో గత బీఆరెస్ ప్రభుత్వ హయాంలో రూ. లక్షల రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన ఈ పర్యాటక విడిది భవనం (హరిత హోటల్) ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోకపోవడంతో ప్రభుత్వ ఆస్తి దొంగల పాలవ్వడమే కాకుండా, దళారుల అక్రమార్జనకు వేదికగా మారి ంది. అలాగే హోటల్ నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అందులోని కరెంట్ సామాను, ఫర్నిచర్, ఫ్యాన్లు, వాష్ బేసిన్లు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ సీలింగ్ సామగ్రి తదితర విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. కాగా ఒకవైపు లక్షల విలువైన సామాగ్రి మాయమవుతుంటే, మరొకవైపు స్థానిక వ్యక్తులు ఏకంగా ఈ ప్రభుత్వ భవనాన్ని ఇతరులకు అద్దెకు (కిరాయికి) ఇస్తూ అక్రమ ఆదాయం ఆర్జిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాక టల్ ఎదురు ఉన్న ఖాళీ ?భూమి, బోరుబావి కూడా ఆక్రమణ చేసుకుని సాగుచేస్తున్నారు. అదీకాక భవనాన్ని అద్దెకు ఇవ్వడమే కాకుండా, హోటల్ చుట్టూ ఉన్న ఖాళీ స్థలాన్ని, అందులోని ప్రభుత్వ బోరుబావిని కొందరు వ్యక్తులు అక్రమంగా వినియోగిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. దీంతో బోరు నీటితో అక్కడ మిర్చి, ఇతర అపరాల పంటలు సాగు చేయడంతో పాటు పంట చేతికొచ్చాక ఆ స్థలాన్ని రైతులకు మిర్చి, వరి ధాన్యం ఆరబెట్టుకోవడానికి అద్దెకు ఇస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారని ఆరోపణలు న్నాయి. అంతేకాకుండా మల్లూరు పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు, పర్యాటకులు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతుంటే గత బీఆరెస్ ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ ఆస్తి ఇలా దళారుల చేతుల్లో దుర్వినియోగం కావడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నా సంబంధిత పర్యాటక శాఖ అధికారులు గానీ, స్థానిక యంత్రాంగం గానీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిం చడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఉన్నతాధికారులు స్పందించి హరిత హోటల్‌తో పాటు చుట్టుపక్కల స్థలాన్ని, బోరుబావిని అక్రమంగా వినియోగిస్తున్న వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవాలని, భవనాన్ని పర్యాటక శాఖ తక్షణమే తమ ఆధీనంలోకి తీసుకుని, అందుబాటులోకి తెచ్చి పర్యాటకులకు వసతి కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## బస్టాండ్ ప్రారంభోత్సవం ఎప్పుడో



అధికారుల అలసత్వం,కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి ప్రయాణికులకు నిలువనీడ కల్పించేందుకు నిర్మిస్తున్న బస్ స్టాండ్ నిర్మాణపు పనులు నిలిచిపోయి అసంపూర్తిగా కనిపిస్తుంది. అంతేకాక మంగపేట మీదుగా ప్రతీరోజు పలు డిపోలకు చెందిన సుమారు 40 ఆర్టీసీ బస్సులు ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేరవేస్తుంటాయి.కానీ మంగపేట లో బస్ స్టాశీడ్ లేకపోవడంతో ప్రయాణీకులు బస్సుల కోసం నిలువ నీడ లేక ఎండకు, వానకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అదీకాక ప్రయాణీకుల ఇబ్బందులు గమనించిన గత ప్రభుత్వం అప్పటి ఎంపీడీఓ కార్యాలయం పక్కన గల ప్రభుత్వ భూమిని బస్ స్టాశీడ్ నిర్మాణానికి కేటాయించి, 52 లక్షలు మంజూరీ చేసింది. దీంతో ప్రభుత్వం మారడంతో ప్రస్తుత మంత్రి సీతక్క చొరవతో నిర్మాణపు పనులు మొదలయ్యాయి. కాగా ఈ ఏడాది జరిగిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర నాటికి పూర్తి కావాల్సిన పనులు నేటి వరకు పూర్తి కాలేదు. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

# డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అఖిల పక్ష పార్టీల సమావేశం

ప్రత్యేక సమగ్ర సవరణ - 2026 లో భాగంగా 01-10-2026 అర్హత తేదీగా రూపొందించిన ముసా యిదా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కె కృష్ణవేణి అన్నారు. అలాగే భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపడుతున్న ప్రక్రియలో భాగంగా 109-ములుగు (ఎస్టీ) అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కె. కృష్ణవేణి బుధవారం ములుగు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సర్-2026కు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాను 17.08.2026 న ప్రచురించినట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రతిని 109-ములుగు (ఎస్టీ) అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన గుర్తింపు పొందిన రాజకీ య పార్టీల ప్రతినిధులకు అందజేశారు. అదేవిధంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పరిశీలించి, అర్హత కలిగిన ఓటర్ల పేర్లు సక్రమంగా నమోదయ్యాయా, ఏవైనా అభ్యంతరాలు లేదా



సవరణలు అవసరమా అనే అంశాలను పరిశీలించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. కాగా అన్‌మ్యాప్డ్ ఓటర్లు మరియు అనామలీస్ SI=-2026 ప్రక్రియలో భాగంగా 109-ములుగు (ST) అసెంబ్లీ నియోజకవ ర్గంలో 11,308 మంది ఉన్నట్లు సమావేశంలో వివరించారు. అదేవిధంగా 30465, గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ రెండింటిని కలిపి మొత్తం 41,773 కేసులు/ఎంట్రీలు ఉన్నట్లు సమావేశంలో వివరించారు. అలాగే అన్‌మ్యాప్డ్ ఓటర్లు, అనామ లీస్‌కు సంబంధించిన వివరాలను సంబంధిత రికార్డు లతో పరిశీలించి, అవసరమైన ధృవీకరణ చర్యలు చేపట్టాలని ఈఆర్వో/ఏఈఆర్వో లు, బీఎల్వోలు, సంబంధిత సిబ్బందికి సూచించినట్లు తెలిపారు.

అదీకాక అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అలాగే ఓటరు జాబితాలోని వివరాలు ఖచ్చితంగా ఉండేలా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు మరియు ఓటరు వివరాల సవరణకు సంబంధించిన ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. నిర్ణయించిన గడువులోపు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సమర్పించాలని సూచించారు. అనంతరం 109-ములుగు (ఎా) అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో పాల్గొని, డ్రాఫ్ట్ ఓటరు జాబితా తదితర అంశాలపై చర్చించారు.

ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఎన్. విజయ భాస్కర్, సూపరింటెండెంట్ సలీమ్, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) నితీష్, డిప్యూటీ తహసీల్దార్ (ములుగు) సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు



కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టులో జరు గుతున్న న్యాయ ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వంపై కుట్రగా చిత్రీకరిస్తూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు దుష్ప్రచారం చేసు_న్నారని బయ్యారం మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తిరుమల సుధాకర్ రెడ్డి మండి పడ్డారు. న్యాయస్థాన ప్రక్రియ లను రాజకీయం చేస్తూ పేదల ను భయభ్రాంతులకు గురిచేయడం మానుకోవాలని ఆయన హితవుపలికారు.గత బిఆర్ఎస్ పాలనలో ఈ పథకాల అమలులో తీవ్ర జాప్యం,అవినీతి చోటుచేసుకున్నాయని,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అర్హులకు వేగంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి తెలిపారు.

## విద్యుత్ షాక్ తో మహిళ మృతి



విద్యుత్ షాక్ తో ఓ మహిళ మృతి చెందిన విషాద సంఘటన మండలంలోని పాత రెడ్యాల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పర్శక బుచ్చమ్మ (56) ఇంటి వద్ద బైనింగ్ తీగకు తడి బట్టలు ఆరేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అయింది. దీంతో ఆమె విద్యుత్ షాక్‌కు గురై స్పృహ తప్పి కిందపడిపోయింది. తల్లిని రక్షించేందుకు ఆమె కుమారుడు అనిల్ ప్రయత్నించగా అతనికి కూడా విద్యుత్ షాక్ తగిలింది. అయితే అనిల్ స్వల్ప ప్రమాదంతో బయటపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి బుచ్చమ్మను మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. బుచ్చమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో పాత రెడ్యాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# పెద్ది విగ్రహం తొలగింపు ఉద్యమకారులకు అవమానం

తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని నర్సంపేటలో తొలగించడం, కూల్చివే యడం జరిగిందన్న వార్తలను తీవ్రంగా ఖండిస్తు న్నామని గోవిందరావుపేట మండల ఉద్యమకారుల అధ్యక్షుడు మెడుదుల వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ అన్నా రు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను గుర్తించాల్సిన ప్రభుత్వం, ఉద్యమ కారుల గుర్తులను తొలగించే పరిస్థితి రావడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. దీంతో ఒక ఉద్యమకారుడి విగ్రహాన్ని తొలగించడం కేవలం ఒక విగ్రహాన్ని తొలగించడం కాదని, అది తెలంగాణ ఉద్యమ చరిత్రను, ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని అన్నారు. నర్సంపేటలో ప్రజా స్వామ్య పాలన కొనసాగుతోందా? లేక రాజకీయ కక్షలు ఆధిపత్య ధోరణులు కొనసాగుతున్నాయా? అనే ప్రశ్నలకు పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా ఒక పార్టీ బలపడుతుందనే



భయంతో ఉద్యమకారుల గుర్తులను తొలగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు "తెలంగాణ కోసం రోడ్లపైకి వచ్చి పోరాడిన ఉద్యమకారుల చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. విగ్రహాలను తొలగించవచ్చు కానీ ఉద్యమకారుల త్యాగాల జ్ఞాపకాలను ప్రజల మనసుల నుంచి తొలగించడం ఎవరి వల్లా కాదు" అని అజ్మీర సురేష్ స్పష్టం చేశారు పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని వెంటనే అధికారికంగా పునఃప్రతిష్ఠించాలని, జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యమకారులను అవమానించే చర్యలు పునరావృత మైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే కక్షపూరిత రాజకీయాలు, వ్యక్తిగత విమర్శలు, ఆధిపత్య రాజకీ యాలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నా రు. "ఉద్యమకారులను అవమానిస్తే మౌనంగా ఉండే ది లేదు. తెలంగాణ ఉద్యమ చరిత్రను కాపాడు కోవడం ప్రతి ఉద్యమకారుడి బాధ్యత" అని పేర్కొ న్నారు. విగ్రహం పునఃప్రతిష్ఠతో పాటు నర్సంపేటలో ఉద్యమకారుల గౌరవాన్ని కాపాడే విధంగా ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి గారి విగ్రహం తొలగింపు చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మళ్లీ దశఉద్యమకారుడుసీనియర్ నాయ కులు లాకావత్ చందులాల్ మండల అధ్యక్షులు వెంకన్న ధనుంజయ్ తాటికొండ శీను పున్నం సమ్మ య్య వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సభ సీట్లు యధాతథంగా కొనసాగించాలి

### అందులోనే మహిళా రిజర్వేషన్ల అమలు

### కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ డిమాండ్

లోక్‌సభ స్థానాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యతిరేకించింది. ప్రస్తుతమున్న 543 స్థానాలనే కొనసాగించాలని, వీటిలోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొంది. పార్లమెంటు సమావేశాల్లో పేపర్ లీక్ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసిందని, ఈ విషయంలో ప్రతిపక్షాలు విజయం సాధించినట్లు భావిస్తున్నామని తెలిపింది. నీట్ వ్యవహారంతోపాటు రామమందిర విరాళాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పోరాటానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌లు మీడియాకు వెల్లడించారు. అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా ఆక్రమణలపై కేంద్రం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విదేశీ విధానంపైనా విమర్శలు గుప్పించింది. అనేక అంశాల్లో కేంద్రం వైఫల్యం చెందిందని ఆరోపించిన కాంగ్రెస్.. విద్యార్థులు, యువతతో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 800 నగరాలు, పట్టణాల్లో వీటిని నిర్వహించాలని, కొన్ని చోట్ల రాహుల్ పాల్గొంటారని పేర్కొంది.

# ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవ వేడుకలు

మల్లంపల్లి మండల కేంద్రంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు శ్రీరామ స్టూడియో అధినేత బక్కి నాగరాజు ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్లు అందరు కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకు ంటూ, ఎంతో సంతోషంగా వేడుకలు జరుపుకున్నారు. అంతేకాక



జ్ఞాపకాలను బంధించే ఫోటోగ్రాఫర్ల సేవలను గుర్తు చేసుకుంటూ అందరూ ఐక్యంగా ఉంటూ వృత్తిలో రాణించాలని ఈ సందర్భంగా మాట్లాడారు ఈ వేడుకల్లో ఇమ్మడి నరేష్, గోరంట్ల ప్రణయ్ , ఎనగందుల అరుణ్, భయ్యా రాజేందర్,భూక్య రాజేందర్, ప్రకాష్ లు పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com